# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 82, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) సోమవారం -09 - జూన్ - 2025


## ఏపీ రాష్ట్ర చరిత్రలోనే భారీగా ప్రమోషన్లు.. వైకాపా సానుభూతి ఉద్యోగులకు కూడా..

ఆన్‌లైన్ ద్వారా 4,853 పదోన్నతులు, 35,235 బదిలీలు విజయవంతంగా పూర్తి చేసినట్లు విద్యాశాఖ ప్రకటన

"టీచర్ ట్రాన్స్‌ఫర్స్ యాక్ట్"ను అమల్లోకి

## దేశంలో కోవిడ్ కలకలం.. ఆరు వేలు దాటిన యాక్టివ్ కేసులు

- దేశంలో కొత్తగా 1,131 కోవిడ్ కేసులు నమోదు
- దేశంలో ఆదివారం ఉదయం 8 గంటల నాటికి కోవిడ్-19 యాక్టివ్ కేసుల సంఖ్య 6,133కి చేరుకుంది
- కోవిడ్‌తో దక్షిణాది రాష్ట్రాల్లో ఆరుగురు మృతి
- కేరళలో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, తమిళనాడులో ఒకరు మృతి

2లో



## వక్ఫ్ (సవరణ) చట్టం 2025కు రాష్ట్రపతి ఆమోదం



### చట్ట సవరణ బిల్లుపై లోక్‌సభ, రాజ్యసభల్లో హృదయపూర్వక చర్చలు
### అధిక సంఖ్యలో సభ్యులు బిల్లుకు మద్దతు
### లోక్‌సభలో ఈ బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు

ఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వక్ఫ్ (సవరణ) చట్టం 2025 కు ఏప్రిల్ 5న అధికారికంగా ఆమోదం తెలిపారు. ఈ చట్ట సవరణ బిల్లుపై లోక్‌సభ, రాజ్యసభల్లో హృదయపూర్వక చర్చలు జరుగగా, అధిక సంఖ్యలో సభ్యులు బిల్లుకు మద్దతు ప్రకటించారు. లోక్‌సభలో మిగతా.. 2లో

## దత్తాత్రేయది పేరుకు హిందుత్వం
# మతం భారతీయం

- ★ అలయ్ బలయ్ అంటే జ్ఞాపకం వచ్చేది దత్తాత్రేయ
- ★ దత్తాత్రేయ కోరుకున్నది జనహితం ఆయనది లౌకికవాదం
- ★ హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ
- ★ రాజకీయాల్లో నీతి, నిజాయితీ సిద్ధాంతాలు ముఖ్యం: వెంకయ్య





హైదరాబాద్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయది పేరుకు హిందుత్వం మతం భారతీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలయ్ బలయ్ అంటే జ్ఞాపకం వచ్చేది దత్తాత్రేయ అని అభివర్ణించారు. దత్తాత్రేయ కోరుకున్నది జనహితం ఆయనది లౌకికవాదమని కొనియాడారు. లేఖలు రాయడంలో దత్తాత్రేయ అంబాసిడర్‌గా నిలిచారని సీఎం ప్రశంసించారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమర (ఆదివారం) జరిగింది. 'ప్రజల కథే నా ఆత్మకథ' పేరుతో దత్తాత్రేయ పుస్తకం రచించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కిషన్‌రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, ఏపీ గవర్నర్ నజీర్, ఏపీ మంత్రి సత్యకుమార్, పలు రాష్ట్రాల గవర్నర్లు, పలువురు కేంద్రమంత్రులు హాజరయ్యారు. .ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, మిగతా.. 2లో

2లో



## కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం ఏంటీ

- కాళేశ్వరం కమిషన్ విచారణపై ఈటల సంచలన వ్యాఖ్యలు
- తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యలను తిప్పికొట్టిన ఈటల

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం తనకు లేదని బీజేపీ నేత, తెలంగాణ మాజీ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరైన ఈటల.. కేసీఆర్ ను రక్షించేందుకే వాస్తవాలను దాచిపెట్టారన్న ఆరోపణలపై మాజీ మంత్రి స్పందించారు. ఆదివారం

'మిగతా.. 2లో

## విజయవాడలో 'సెలూన్ కొనికి' ప్రారంభోత్సవం...

- విజయవాడలో 'కొనికి' పేరుతో నూతన సెలూన్ ప్రారంభం
- ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- పాల్గొన్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- సెలూన్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు
- ట్రెండీ దుస్తుల్లో ఆకట్టుకున్న పవన్ కల్యాణ్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం విజయవాడలో సందడి చేశారు. నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన "కొనికి" అనే సెలూన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్, యార్లగడ్డ వెంకట్రావు ఇరువురూ మిగతా.. 2లో

## "వేశ్యలు" అంటూ చేసిన వ్యాఖ్యలను ఉపేక్షించే పరిస్థితే లేదు

- రాజధాని మహిళలపై సాక్షి టీవీలో జర్నలిస్ట్ కృష్ణంరాజు వివాదాస్పద వ్యాఖ్యలు
- జర్నలిస్ట్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, ఖండన
- స్త్రీ జాతిని అవమానిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసిన సీఎం
- మాజీ సీఎం జగన్ తీరుపై చంద్రబాబు అసంతృప్తి, విచారం
- మహిళల మనోభావాలు దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



అమరావతి: రాజధాని అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి సాక్షి టీవీ ఛానల్ లో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ మిగతా.. 2లో



## కొత్త మంత్రులకు శుభాభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి...

### ముగ్గురూ తొలిసారి ఎమ్మెల్యేలే!

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ నూతన మంత్రులు, డిప్యూటీ స్పీకర్ నియామకం

- వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరికి మంత్రి పదవులు
- శాసనసభ ఉపసభాపతిగా రామచంద్రు నాయక్ నియామకం

2లో



### మోదీ, చంద్రబాబు వద్ద చదువుకుని...
## రాహుల్ వద్ద ఉద్యోగం చేస్తున్నా

హైదరాబాదులో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ

హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

ఇటీవల నీతి ఆయోగ్ సమావేశం సందర్భంగా జరిగిన సంభాషణ వెల్లడించిన వైనం

## తెలంగాణ క్యాబినెట్ విస్తరణ..
# నూతన మంత్రుల ప్రమాణస్వీకారం

- ➢ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారితో ప్రమాణం
- ➢ మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని నూతన మంత్రులను ఎంపిక
- ➢ గడ్డం వెంకటస్వామి వారసుడిగా..
- ➢ ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే మంత్రి పదవి
- ➢ వాకిటి శ్రీహరి రాజకీయ నేపథ్యమిది




హైదరాబాద్: తెలంగాణ క్యాబినెట్ విస్తరణ జరిగింది. రాజ్‌భవన్‌లో నూతన మంత్రులుగా జి.వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు పాల్గొన్నారు. మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి మిగతా.. 2లో



## మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం: ప్రధాని మోదీ

- కేంద్రంలో వరుసగా మూడోసారి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటై నేటికి ఏడాది పూర్తి
- 11 ఏళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు
- "విద్యా, క్రీడలు, స్టార్టప్, సైన్స్ ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమదైన ముద్ర

శుభోదయం

జనరల్ న్యూస్

సోమవారం - 09 - జూన్ - 2025

# దత్తాత్రేయది పేరుకు హిందుత్వం మతం భారతీయం



మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ,జెంటిల్‌మెన్‌కు ప్రతిరూపం దత్తాత్రేయ అని అన్నారు. దత్తాత్రేయను దత్తన్న అని అభిమానంగా పిలుచుకుంటారన్నారు. సాధారణ కార్యకర్త నుంచి జాతీయ నేతగా ఎదిగారని కొనియాడారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, సంఘర్షణలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. "దత్తాత్రేయ కోరుకుంది జనహితం.. ఆయనది లౌకిక వాదం. ఆయన పాటించేది మత సామరస్యం. 'అలయ్ బలయ్' పేరుతో అన్ని వర్గాలను ఏకతాటిపైకి తెచ్చారు. అందరినీ కలిపేందుకు వేదిక రూపొందించారు. ఆయనకు విరోధులు ఎవరూ ఉండరు. ఆయనకు ఏ రాజకీయ పార్టీ అనే వ్యత్యాసం ఉండదు. దత్తాత్రేయది ఆదర్శ రాజకీయ జీవితం. ప్రజాసమస్యలపై ప్రభుత్వాలు, సీఎంలకు లేఖలు రాశారు. లేఖలు రాయడంలో అంబాసిడర్‌గా నిలిచారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం అనునిత్యం పనిచేశారు. ఉత్తర, దక్షిణ భారత్ ప్రజలతో ఆయన మమేకమయ్యారు" అని చంద్రబాబు తెలిపారు

## రాజకీయాల్లో నీతి, నిజాయితీ సిద్ధాంతాలు ముఖ్యం: వెంకయ్య

బండారు దత్తాత్రేయ ఆటో బయోగ్రఫీ పుస్తకావిష్కరణలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొని మాట్లాడారు. 'ప్రజల కథే నా ఆత్మకథ' పేరుతో బండారు దత్తాత్రేయ ఆటో బయోగ్రఫీ రచించారని తెలిపారు. రాజకీయాల్లో నీతి, నిజాయితీ సిద్ధాంతాలు ముఖ్యమని ఉద్ఘాటించారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని సూచించారు. రాజకీయ విమర్శలు సంస్కారవంతంగా ఉండాలని చెప్పారు. అసభ్యంగా మాట్లాడే వారికి ఎన్నికల్లో సరైన జవాబివ్వాలని వెంకయ్యనాయుడు తెలిపారు.

ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. మనోహర్ షిండే వల్లే తాను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. "ఆర్ఎస్ఎస్ నా ప్రాణం, నా ఆత్మ, నా సర్వం. వి రామారావు నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చి నడిపించారు. ఇంద్రాసేనారెడ్డి కూడా నా వెన్నంటే ఉన్నారు. రాజకీయాలు వృత్తి, వ్యాపారం కోసం కాదు.. సమాజం కోసం. సమాజం కోసం పనిచేయాలి. పేదల వృద్ధికి కృషి చేయాలి"అని అన్నారు.

తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తూ.. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఇది కేవలం వ్యక్తిగత ప్రయాణం కాదని, గత 60 ఏళ్లలో భారత రాజకీయ, సామాజిక మార్పులకు ప్రతీక అని అన్నారు. ఇలాంటి వ్యక్తిని అందించినందుకు దత్రాత్రేయ తల్లిదండ్రులకు దేశం కృతజ్ఞతలు చెబుతోందన్నారు. "దత్తాత్రేయ.. వాజ్‌పేయీ, అద్వానీ వంటి ప్రముఖులతో కలిసి పనిచేశారు. పని చేసిన ప్రతి హోదాలో పేదలకు మేలు చేసేందుకు విశేషంగా కృషి చేశారు. అలయ్ బలయ్ ద్వారా అందరినీ ఒక తాటిపైకి తీసుకొస్తున్నారు. అధికారం కేవలం పరపతి, పేరు కోసం కాదు.. సేవ చేసేందుకు అనేందుకు ఆయన జీవితం ఒక నిదర్శనం"అని అన్నారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ, ఏపీ, ఒడిశా, త్రిపుర గవర్నర్లు జిష్ణుదేవ్ వర్మ, జస్టిస్ అబ్దుల్ నజీర్, కంభంపాటి హరిబాబు, ఇంద్రసేనారెడ్డి హాజరయ్యారు. తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భాజపా ఎంపీ లక్ష్మణ్, కాంగ్రెస్ నేతలు కె.కేశవరావు, వి.హనుమంతరావు తదితరులు హాజరయ్యారు.

# "వేశ్యలు" అంటూ చేసిన వ్యాఖ్యలను ఉపేక్షించే పరిస్థితే లేదు

మొదటి పేజీ తరువాయి

అమరావతి: రాజధాని అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి సాక్షి టీవీ ఛానల్ లో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజధాని గురించి, అక్కడి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా 'వేశ్యలు' అంటూ చేసిన దారుణమైన వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ, మీడియా ముసుగులో సాగుతున్న ఇలాంటి వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. "తన సొంత మీడియా చానల్ ద్వారా జరిగిన ఈ దారుణాన్ని ఒక మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం మరింత విచారకరం. ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి మనది. స్త్రీమూర్తులను ఆరాధించే సమాజం మనది. ఇది మన సంప్రదాయం. మన భారతీయ జీవన విధానం. ముఖ్యంగా మన తెలుగు ప్రజల విషయానికి వస్తే ఆడబిడ్డను, అమ్మను ఎంతో ఆదరణతో చూస్తాం. అలాంటి మన రాష్ట్రంలో రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా ఏకంగా మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం. వాళ్లు ఎప్పుడూ అనుసరించే ఈ విష సంస్కృతిపై తిరుగుబాటుగా గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినా వారి వైఖరిలో మార్పు రాలేదనేది సుస్పష్టం.రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టు దాటి మహిళల మనోభావాలను గాయపరచిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం. గత విధ్వంస ప్రభుత్వం పై రాజధాని మహిళల పోరాటాన్ని మనసులో పెట్టుకుని ఆ ప్రాంత మహిళలపై ఉద్దేశ్యపూర్వకంగా, నీచాతినీచంగా చేసిన ఈ వ్యాఖ్యలు మొత్తం మహిళా సమాజాన్నే అవమానించడం. మహిళలను గౌరవించే, వారి ఆత్మగౌరవానికి అండగా నిలిచే కూటమి ప్రభుత్వం ఈ నీచ సంస్కృతికి చెక్ పెట్టే బాధ్యత తీసుకుంటుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం ఏంటీ

మొదటి పేజీ తరువాయి

మాజీ మంత్రి స్పందించారు. ఆదివారం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినపుడు ఆర్థిక మంత్రిగా ఉన్నానని, ఆ సమయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, వాటిలో తన పాత్రను కమిషన్ ముందు వెల్లడించినట్లు చెప్పారు. ఈ విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కాంగ్రెస్ నేతలు ఇలాంటి కామెంట్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ ఉప సంఘం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టే లేదని తెలిపారు. కాళేశ్వరంలోని అనేక ప్రాజెక్టుల రీడిజైనింగ్ను కేబినెట్ సబ్ కమిటీ సూచించింది. త్వరలోనే అన్ని జీవోలు, సబ్ కమిటీ నిర్ణయాలు, సూచనలు బయటపెడతా అని చెప్పారు.

### మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై..

కాళేశ్వరం ప్రాజెక్టు అంశం అసలు కేబినెట్ ముందుకే రాలేదంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను ఈటల రాజేందర్ కొట్టిపారేశారు. కేబినెట్లో చర్చించకుండా ప్రభుత్వంలో ఏదీ జరగదని గుర్తుచేశారు. అలాంటిది కాళేశ్వరం ప్రాజెక్టుపై కేబినెట్ చర్చించలేదనడం సరికాదని అన్నారు. ప్రాజెక్టు విషయంలో తీసుకున్న ప్రతీ నిర్ణయంపై కేసీఆర్ అందరితో సంతకాలు తీసుకున్నారని చెప్పారు. ఈ విషయం అప్పటి మంత్రులు తుమ్మల, జూపల్లి, కడియం శ్రీహరిలకు కూడా తెలుసని అన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

# విజయవాడలో 'సెలూన్ కొనికి' ప్రారంభోత్సవం...

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా పవన్ కల్యాణ్, యార్లగడ్డ వెంకట్రావు ఇరువురూ సెలూన్ నిర్వాహకులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపారం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి పవన్ కల్యాణ్ లేత నీలం రంగు రౌండ్ నెక్ టీషర్ట్, నలుపు రంగు షార్ట్స్ ధరించి వచ్చారు. ఆయన క్యాజువల్ లుక్ అందరినీ ఆకట్టుకుంది, ట్రెండీగా కనిపించిందని పలువురు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

# ఏపీ రాష్ట్ర చరిత్రలోనే భారీగా ప్రమోషన్లు..

అమరావతి: ఏపీ రాష్ట్ర చరిత్రలోనే వేల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లు లభించాయి. వీరిలో వైకాపా సానుభూతి ఉద్యోగులు కూడా ఉన్నారు. అయితే, ఈ ప్రమోషన్లలో ఎలాంటి తారతమ్యాలు కల్పించ లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం కొందరికి అన్యాయం జరిగిందంటూ ఆరోపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టి, పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా, కేవలం సర్వీసునే ప్రామాణికంగా తీసుకుంటున్న ఈ ఆన్‌లైన్ విధానంపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులకు స్పష్టంచేసింది. పైరవీలకు, రాజకీయ జోక్యానికి ఆస్కారం లేదని భరోసా ఇచ్చింది. ఈ యేడాది రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా, ఎటువంటి రాజకీయ ప్రమేయానికి తావులేకుండా ఆన్‌లైన్ ద్వారా 4,853 పదోన్నతులు, 35,235 బదిలీలు విజయవంతంగా పూర్తి చేసినట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఉపాధ్యాయ సంఘాలతో పలు దఫాలుగా చర్చించి, వారి సూచనలు పరిగణనలోకి తీసుకుని, ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం "టీచర్ ట్రాన్స్‌ఫర్స్ యాక్ట్"ను అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం అన్ని బదిలీలను కేవలం ఆన్‌లైన్ ద్వారానే నిర్వహిస్తున్నారు. 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి, ఆన్‌లైన్ బదిలీల్లో ఉపాధ్యాయుల సౌలభ్యం కోసం పలు నూతన సాంకేతిక సౌకర్యాలు ప్రవేశపెట్టారు. మండల కేంద్రం నుంచి పాఠశాల దూరం, క్లస్టర్లలో ఖాళీల వివరాలు స్పష్టంగా చూపుతున్నారు. ఆప్షన్లను పలుమార్లు మార్చుకునే వీలు, అవగాహన వీడియోలు, సాంకేతిక సందేహాల నివృత్తికి సహాయ కేంద్రాలు ఏర్పాటుచేశారు. తప్పనిసరి బదిలీ అయ్యేవారు తమ ఆప్షన్లను ఖచ్చితంగా ఖరారు చేయాల్సి ఉంటుంది. గతంలోని మాన్యువల్ కౌన్సెలింగులో ఖాళీల వివరాలు వెంటనే తెలియక సీనియర్లు నష్టపోవడం, రోజుకు కొద్దిమందికే కౌన్సెలింగ్ సాధ్యమవడం, సుదూర ప్రాంతాల నుంచి వచ్చి గంటల తరబడి వేచి చూడాల్సిన ఇబ్బందులు వంటి సమస్యలుండేవని విద్యాశాఖ గుర్తుచేసింది. ఆన్‌లైన్ విధానం వీటికి తెరదించి, సమయం, శ్రమ ఆదా చేయడంతో పాటు, పైరవీలకు పూర్తి అడ్డుకట్ట వేసిందని అధికారులు స్పష్టం చేశారు. సీనియారిటీకి న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1998లో బదిలీల కోసం కౌన్సెలింగ్ విధానం ప్రారంభం కాగా, మాన్యువల్ పద్ధతిలోని లోపాలను అధిగమించేందుకు 2015లో తొలిసారిగా వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ విధానం ఉపాధ్యాయులలో నమ్మకాన్ని పెంపొందించింది. గత ప్రభుత్వం కూడా ఇదే ఆన్‌లైన్ విధానాన్ని కొనసాగించగా, ప్రస్తుత ప్రభుత్వం దానిని మరింత మెరుగుపరిచి, సాంకేతికత సాయంతో ఎలాంటి అపోహలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు విద్యాశాఖ వెల్లడించింది.

## వక్ఫ్ (సవరణ) చట్టం 2025కు రాష్ట్రపతి మోదం

మొదటి పేజీ తరువాయి



హృదయపూర్వక చర్చలు జరుగగా, అధిక సంఖ్యలో సభ్యులు బిల్లుకు మద్దతు ప్రకటించారు. లోక్‌సభలో ఈ బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. రాజ్యసభలో అనుకూల ఓట్లు 128, వ్యతిరేక ఓట్లు 95. ఈ బిల్లుపై విపక్షాల నుండి తీవ్ర విమర్శలు వచ్చినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం దృఢంగా తన వైఖరిని కొనసాగించింది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్, ఈ చట్టం ముస్లింలకు వ్యతిరేకం కాదు అని, ఏ మత విశ్వాసాలనైనా దెబ్బతీయాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఈ సవరణ ద్వారా వక్ఫ్ ప్రాపర్టీల నిర్వహణ, పర్యవేక్షణ, పారదర్శకతకు సంబంధించి కొన్ని కీలక మార్పులు చేయబడ్డాయి. వక్ఫ్ బోర్డుల పని విధానంలో సమీక్ష, ఆస్తుల లెక్కల నిర్వహణ, ప్రజల న్యాయబద్ధమైన వినియోగం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. సారాంశంగా, వక్ఫ్ (సవరణ) చట్టం 2025 ముస్లిం మైనారిటీల ఆస్తుల పరిరక్షణను సమర్థవంతంగా చేస్తుందని కేంద్రం పేర్కొంది. అయితే ఈ చట్టంపై సవాళ్లు, చర్చలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

# తెలంగాణ క్యాబినెట్ విస్తరణ.. నూతన మంత్రుల ప్రమాణస్వీకారం

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని నూతన మంత్రులను ఎంపిక చేసింది. దీనిలో భాగంగానే ఎస్సీల నుంచి వివేక్ (మాల), అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (మాదిగ), బీసీల నుంచి వి.శ్రీహరి ముదిరాజ్‌కు అవకాశం కల్పించారు.

గడ్డం వెంకటస్వామి వారసుడిగా..

గడ్డం వివేక్ చెన్నూరు నుంచి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన ప్రముఖ కాంగ్రెస్ నేత జి.వెంకటస్వామి వారసుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2009లో కాంగ్రెస్ తరపున పెద్దపల్లి ఎంపీగా గెలిచారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 2013లో తెరాస(ప్రస్తుతం భారాస)లో చేరారు. 2014 ఎన్నికల సమయంలో తెరాస నుంచి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. పెద్దపల్లి స్థానంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2016లో మళ్లీ వివేక్ తెరాసలో చేరారు. ఎంపీ టికెట్ దక్కకపోవడంతో 2019లో ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2019 ఎన్నికల తర్వాత భాజపాలో చేరారు. 2023లో మళ్లీ కాంగ్రెస్‌లో చేరిన వివేక్.. చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిచారు. 2024లో కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి ఎంపీగా వివేక్ కుమారుడు వంశీ గెలిచారు.

ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే మంత్రి పదవి




అడ్లూరి లక్ష్మణ్‌ను ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే మంత్రి పదవి వరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ధర్మపురి నియోజకవర్గం నుంచి గెలిచారు. భారాస అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై 2,229 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1968లో ఆయన కరీంనగర్ జిల్లాలో జన్మించారు. పెద్దపల్లి కళాశాలలో ఐటీఐ పూర్తి చేశారు. 1986-1994 మధ్య కరీంనగర్ జిల్లా ఎన్‌ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1996-2001 మధ్య ఏపీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2006లో ధర్మారం జడ్పీటీసీగా పోటీ చేసి గెలిచారు. 2009లో ధర్మపురి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2010-2012 మధ్య కరీంనగర్ జడ్పీ ఛైర్మన్‌గా పనిచేశారు. 2009లో అసెంబ్లీ ఎన్నికలు, 2010 ఉపఎన్నికలో ఓడారు. 2013-14 మధ్య ఏపీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. 2018 నుంచి జగిత్యాల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు.

వాకిటి శ్రీహరి రాజకీయ నేపథ్యమిది

ఎమ్మెల్యే అయిన తొలిసారే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కింది. ఆయన 1972లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచారు. భారాస అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై 17,522 ఓట్ల తేడాతో గెలిచారు. 2014-2018 మధ్య మక్తల్ జడ్పీటీసీ, జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2001-2006 మధ్య మక్తల్ సర్పంచిగా ఉన్నారు. నారాయణపేట్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శిగా పని చేశారు.

# మోదీ, చంద్రబాబు వద్ద చదువుకుని... రాహుల్ వద్ద ఉద్యోగం చేస్తున్నా సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: హైదరాబాదులో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఓ ఆసక్తికర అంశాన్ని అందరితో పంచుకున్నారు. ఇటీవల తాను ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరయ్యానని, ఈ సందర్భంగా ఆయనతో కలిసి మధ్యాహ్న భోజనం చేశానని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మోదీ... చంద్రబాబు గారిని చూపించి మీ సన్నిహితుడు కూడా ఇక్కడే ఉన్నారు అని చెప్పారు. అప్పుడు నేను... స్కూల్ మీ (బీజేపీ) వద్ద చదువుకున్నాను... కాలేజి ఆయన (చంద్రబాబు) వద్ద చదువుకున్నాను... ఇప్పుడు రాహుల్ గాంధీ వద్ద ఉద్యోగం చేస్తున్నాను అని చెప్పాను. దాంతో అందరూ నవ్వేశారు" అని రేవంత్ రెడ్డి వివరించారు.

## మస్క్ కు సీరియస్ వార్నింగ్ ఇచ్చిన ట్రంప్

అమెరికా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య వివాదం మరింత ముదిరింది. కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన వివాదాస్పద వ్యయ బిల్లుకు అనుకూలంగా ఓటు వేసే రిపబ్లికన్లను శిక్షించేందుకు మస్క్ ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ ప్రతిపాదించిన "బిగ్ బ్యూటిఫుల్ బిల్"ను మస్క్ తీవ్రంగా విమర్శించడంతో ఈ వివాదం మొదలైంది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఉన్న కొందరు చట్టసభ సభ్యులు, బిల్లుకు మద్దతిచ్చే రిపబ్లికన్లపై ప్రైమరీ ఎన్నికల్లో పోటీకి నిధులు సమకూర్చాలని గత ఏడాది అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి మద్దతు ఇచ్చిన మస్క్‌ను కోరారు. దీనిపై స్పందించిన ట్రంప్.. "అతను (మస్క్) అలా చేస్తే చాలా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది" అని ఎన్బీసీ న్యూస్‌తో అన్నారు. మస్క్ "అగౌరవంగా" ప్రవర్తించారని కూడా ట్రంప్ ఆరోపించారు. మస్క్‌తో సంబంధాన్ని చక్కదిద్దుకోవాలనే కోరిక తనకు లేదని, అతనితో మాట్లాడే ఉద్దేశం కూడా లేదని ట్రంప్ స్పష్టం చేశారు.

# దేశంలో కోవిడ్ కలకలం.. ఆరు వేలు దాటిన యాక్టివ్ కేసులు

ఢిల్లీ: భారత్‌లో రోజురోజుకూ కోవిడ్-19 యాక్టివ్ కేసులు పెరగడం ఆందోళన రేకెత్తిస్తోంది. దేశంలో కొత్తగా 1,131 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో కేసుల సంఖ్య ఆరు వేలు దాటింది. దేశంలో ఆదివారం ఉదయం 8 గంటల నాటికి కోవిడ్-19 యాక్టివ్ కేసుల సంఖ్య 6,133కి చేరుకుందని ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కోవిడ్‌తో దక్షిణాది రాష్ట్రాల్లో ఆరుగురు మృతి చెందారు. కేరళలో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, తమిళనాడులో ఒకరు మృతి చెందారు. కేరళలో 1950, గుజరాత్‌లో 822, బెంగాల్‌లో 693, మహారాష్ట్రలో 595, కర్ణాటకలో 366, ఏపీలో 86, తెలంగాణలో 10 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కోవిడ్ మృతుల సంఖ్య కూడా పెరగడంతో మరో 'కరోనా వేవ్'ముంచెత్తుతుందా అన్న భయాలు సైతం వివిధ వర్గాల ప్రజల్లో నెలకొన్నాయి. కేరళలో అత్యధిక పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తర్వాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. కేరళలో శనివారం నాటికి (గత 24 గంటల్లో) 192, గుజరాత్‌లో 107, పశ్చిమబెంగాల్‌లో 58, కర్ణాటకలో 15, ఆంధ్రప్రదేశ్‌లో 12 కొత్త యాక్టివ్ కేసులు వెలుగు చూశాయి. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లోనూ యాక్టివ్ కేసులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం కేసుల వ్యాప్తికి కారణమైన ఒమిక్రాన్ సబ్‌వేరియెంట్లు, లీనియేజ్‌లు ఎగువ శ్వాసకోశ వ్యవస్థ (అప్పర్ రెస్పిరేటరీ) పైనే ప్రభావం చూపుతున్నందున పెద్దగా భయపడాల్సిన పనిలేదని వైద్య నిపుణులు అంటున్నారు.

# కొత్త మంత్రులకు శుభాభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి...

## ముగ్గురూ తొలిసారి ఎమ్మెల్యేలే!

### తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ

### నూతన మంత్రులు, డిప్యూటీ స్పీకర్ నియామకం

హైదరాబాద్: తెలంగాణ క్యాబినెట్ విస్తరణ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, నూతన మంత్రులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషెస్ తెలియజేశారు. నూతన మంత్రులుగా వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి అవకాశం దక్కించుకున్న సంగతి తెలిసిందే. అదేవిధంగా, శాసనసభ ఉపసభాపతి (డిప్యూటీ స్పీకర్)గా రామచంద్రు నాయక్ నియమితులయ్యారు. దీనిపై రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. "నూతన మంత్రులుగా బాధ్యతలు స్వీకరించబోతున్న వివేక్ వెంకట స్వామి గారు, అడ్లూరి లక్ష్మణ్ గారు, వాకిటి శ్రీహరి గారికి నా అభినందనలు. శాసనసభలో ఉప సభాపతి బాధ్యతలు స్వీకరించబోతున్న రామచంద్రు నాయక్ గారికి నా అభినందనలు..." అని పేర్కొన్నారు. కాగా, మంత్రివర్గంలో చాన్స్ దక్కించుకున్న ఈ ముగ్గురు కూడా తొలిసారి ఎమ్మెల్యేలు కావడం విశేషం. వివేక్ వెంకటస్వామి గతంలో ఎంపీగా పనిచేసిన సంగతి తెలిసిందే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక వాకిటి శ్రీహరి మక్తల్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందగా, అడ్లూరి లక్ష్మణ్ ధర్మపురి సెగ్మెంట్లో విజేతగా నిలిచారు.

## ఇదిగో ఇందుకే మేం దాడులు చేస్తున్నాం.. ఇజ్రాయెల్ సైన్యం

ఇజ్రాయెల: గాజాలో హమాస్ ను తుడిచిపెట్టేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్%-%ఐడీఎఫ్) దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆసుపత్రులపైనా ఐడీఎఫ్ దాడులు చేస్తోందని, అమాయక ప్రజలను చంపేస్తోందంటూ ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివిధ దేశాధినేతలు ఇప్పటికే ఇజ్రాయెల్ తీరును తప్పుబడుతున్నారు. ప్రధాని నెతన్యాహు ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, తాజాగా గాజాపై దాడులను సమర్థించుకుంటూ ఐడీఎఫ్ తాజాగా ఓ వీడియో బయటపెట్టింది. ఖాన్ యూనిస్‌లోని ఒక కీలకమైన ఆస్పత్రి కింద హమాస్ సొరంగం కనుగొన్నామంటూ ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. వీడియోలోని దృశ్యాలను గమనిస్తే.. యూరోపియన్ హాస్పిటల్ కాంపౌండ్‌లో ఓ సొరంగం కనిపిస్తోంది. దీనిని హమాస్ కమాండ్-అండ్-కంట్రోల్ సెంటర్‌గా ఉపయోగిస్తోందని, ఇక్కడి నుంచే ఇజ్రాయెల్ పై దాడులకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఐడీఎఫ్ ఆరోపించింది. సొరంగంలో ఆయుధాలు, నిఘా సామగ్రి ఇతర పరికరాలు ఉంచిన కంట్రోల్ రూములు కూడా కనిపిస్తున్నాయి. హమాస్ తన ప్రయోజనాల కోసం గాజాలోని ఆసుపత్రులను స్థావరాలుగా వాడుకుంటూ పౌరుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తోందని ఐడీఎఫ్ ఆరోపించింది. 2023లోనూ ఇదే విధంగా గాజాలోని అతిపెద్ద ఆస్పత్రి అల్ షిఫా కింద సొరంగాన్ని కనుగొన్నట్లు ఐడీఎఫ్ పేర్కొంది. వాటిని ధ్వంసం చేయడానికి తాము దాడులు చేసినప్పుడు అక్కడ ఉన్న అమాయకులు సైతం ప్రాణాలు కోల్పోతున్నారని వివరించింది.

## అదానీ వార్షిక వేతనం రూ.10.41 కోట్లు..

### సొంత ఎగ్జిక్యూటివ్‌ల కంటే తక్కువ!

ఇంటర్నెట్‌డెస్క్: దేశంలోని అత్యంత సంపన్నుల్లో రెండో స్థానంలో ఉన్న అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.10.41 కోట్ల వేతనం అందుకున్నారు. అయితే, దేశంలోని తోటి పారిశ్రామికవేత్తలు, తన గ్రూప్ కంపెనీల్లో పని చేస్తున్న కొంత మంది ఎగ్జిక్యూటివ్‌ల కంటే తక్కువ కావడం గమనార్హం. ఓడరేవులు, ఇంధన రంగాల్లో విస్తరించిన తొమ్మిది లిస్టెడ్ కంపెనీల్లో కేవలం రెండింటి నుంచి మాత్రమే ఆయన వేతనం తీసుకున్నారు. 2023-24లో రూ.9.26 కోట్లుగా ఉన్న ఈ మొత్తం 2024-25లో 12 శాతం పెరిగింది. గ్రూప్‌లో ప్రధాన సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2.26 కోట్లు అందుకున్నారు. ఇతర అలవెన్సులు, ప్రయోజనాల రూపంలో మరో రూ.28 లక్షలు ఆయనకు లభించాయి. దీంతో ఆయన మొత్తం రూ.2.54 కోట్లు తీసుకున్నాయి. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రూ.2.46 కోట్ల కంటే కొంచెం ఎక్కువ. మరో కంపెనీ అదానీ పోర్ట్స్ అండ్ స్పెషనల్ ఎకనమిక్ జోన్ నుంచి రూ.1.8 కోట్ల వేతనం, రూ.6.07 కోట్ల కమిషన్ (లాభాల్లో వాటా) తో కలిపి రూ.7.87 కోట్లు అందుకున్నారు. అంతకు ముందు ఏడాది ఈ మొత్తం రూ.6.8 కోట్లుగా ఉంది. దేశంలోనే అత్యంత సంపన్నుడైన ముకేశ్ అంబానీ వార్షిక వేతనం రూ.15కోట్లుగా ఉండేది. అయితే, కొవిడ్ తర్వాత ఆయన వేతనాన్ని తీసుకోవడం లేదు. ఇక భారతీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత సునీత్ మిత్తల్ (2023-24లో రూ.32.27 కోట్లు), రాజీవ్ బజాజ్ (రూ.53.75 కోట్లు), పవన్ ముంజాల్ (రూ.109 కోట్లు), ఎల్అండ్‌టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రమణ్యం (76.25 కోట్లు), ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ (రూ.80.62కోట్లు) వేతనాలు అదానీ కంటే అధికంగా ఉన్నాయి. అదానీ గ్రూప్‌లోని కొందరు ఎగ్జిక్యూటివ్‌ల జీతాలు కూడా గౌతమ్ కంటే ఎక్కువ. ఏఈఎల్ సీఈఓ వినయ్ ప్రకాశ్ రూ.69.34 కోట్లు, అదానీ గ్రీన్ ఎనర్జీ సీఈఓ వినీత్ ఎస్.జైన్ రూ.11.23 కోట్లు అందుకున్నారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం.. అదానీ సంపద విలువ 82.5 బిలియన్ డాలర్లు. హిండెన్‌బర్గ్ నివేదిక వల్ల ఆయన ఆస్తుల విలువ సుమారు 150 బిలియన్ డాలర్ల మేరకు తగ్గింది. అయినప్పటికీ గతేడాదిలో రెండు సార్లు ఆసియా అత్యంత ధనవంతుడిగా నిలిచారు. ఇక.. ప్రపంచంలోని సంపన్నుల జాబితాలో ముకేశ్ అంబానీ 104 బిలియన్ డాలర్ల సంపదతో 17వ స్థానంలో, అదానీ 20వ స్థానంలో ఉన్నారు.

## మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం: ప్రధాని మోదీ

దిల్లీ: మహిళల అభివృద్ధి కోసం ఎన్డీఏ సర్కార్ చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి గుర్తు చేశారు. మహిళల నేతృత్వంలో సాధించిన విజయాలను ప్రస్తావించారు. కేంద్రంలో వరుసగా మూడోసారి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటై నేటికి ఏడాది పూర్తి కావొస్తోంది. ఈ నేపథ్యంలోనే 11 ఏళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "విద్యా, క్రీడలు, స్టార్టప్, సైన్స్ ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపైనా మన దేశ కీర్తిని పెంచుతున్నారు. అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్డీఏ సర్కార్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. స్వచ్ఛ భారత్ ద్వారా వారి గౌరవాన్ని కాపాడడం నుంచి జన్‌ధన్ ఖాతాలతో వారిని ఆర్థికంగా బలోపేతం చేసేంత వరకు ఎన్నో పథకాలు అమలు చేశాం. పేద మహిళల ఆరోగ్యం దృష్ట్యా 'ఉజ్వల్ యోజన' పథకం కింద గ్యాస్ సిలిండర్లు అందించాం. 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన'తో పేదలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇచ్చాం. ప్రతి ఆడబిడ్డను రక్షించేందుకు, వారు ఉన్నతంగా ఎదిగేందుకు 'బేటీ బచావో, బేటీ పడావో'ను అమలు చేశాం. పేదలు, రైతులు, యువత కోసం ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని మీరంతా చూశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా 11 ఏళ్లుగా కృషి చేస్తున్నాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## ఏపీ హైకోర్టు జిల్లా కోర్టు

### 1620 జాబ్స్ కు ఉచిత శిక్షణ-కరపత్రాలు విడుదల చేసిన...

భావపురి కోచింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ ఆవల వెంకటేశ్వర్లు




(శుభోదయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జిల్లా కోర్టు లలో 10 కేటగిరీలో 1620 ఉద్యోగాలకు ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది.రాబోవు మూడు నెలల్లో ఈ ఉద్యోగాలకు ఎంపిక కు వ్రాత పరీక్ష నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకున్న కోర్టు జాబ్స్ ఉద్యోగాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న వారికి ఈనెల 9,10,11 తేదీలు సోమ, మంగళ, బుధ వారము లు మూడు రోజులు ఉదయం 9-00 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు బాపట్ల శ్రీ భావపురి కోచింగ్ సెంటర్ నందు ఉచిత శిక్షణ ను విజయవాడ "ఫోకస్ ఫార్టి శిక్షణాసంస్థ హైదరాబాద్ లలో పేరొందిన శిక్షణా సంస్థల సీనియర్ ఫ్యాకల్టీ లచే జీకే,కరెంట్ అఫైర్స్, ఇంగ్లీష్,అర్థమెటిక్ జనరల్ స్టడీస్ అంశాల పై ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపే కరపత్రాలను విడుదల చేసి నిరుద్యోగ అభ్యర్థులంతా ఈ ఉచిత శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9848791935 నెంబర్ కు కాల్ చేయవచ్చని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.ఇంకా ఈ కార్యక్రమంలో భాగంగా డీఎస్సీ పరీక్ష కు హాజరగు అభ్యర్థులకు ఉద్యోగం పొందడానికి అనేక సలహాలను సూచనలను తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు తన మొదటి సంతకం తో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి 16347 టీచర్ ఉద్యోగాలకు అవకాశం కల్పించి నందులకు ధన్యవాదాలు తెలుపుచూ,సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్ మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సి ఈ డి ఎం) మైనారిటీస్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ద్వారా గత 45 రోజులు గా డీఎస్సీ ఉచిత శిక్షణ పొంది రాతపరీక్ష కు హాజరు కానున్న మైనారిటీ నాన్ మైనారిటీ అభ్యర్థులకు వీడ్కోలు పలుకుతూ సీనియర్ ఫ్యాకల్టీ కె వి ఆర్ జి శర్మ,, శ్రీ హరి లు శుభాకాంక్షలు అందించారు.శిక్షణ పొందిన అభ్యర్థులు సీనియర్ ఫ్యాకల్టీ సార్ లను సన్మానించారు. ఇంకా ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## చదువు పేరుతో వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి




బద్వేల్, నియోజకవర్గం రిపోర్టర్ - శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): కడప జిల్లా వ్యాప్తంగా చదువు పేరుతో వేల,లక్షల,కోట్ల రూపాయల దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోకుండా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారని శనివారం కడప నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...చదువునే వ్యాపారంగా మార్చుకున్న కడప జిల్లాలోని ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలు విపరీతంగా పెరిగిపోయాయని అలాగే కడప నగరం, బద్వేలు, ప్రొద్దుటూరు,జమ్ములమడుగు,పులివెందుల, మైదుకూరు, పోరుమామిళ్ల ప్రాంతాలలో పుట్టగొడుగులు లాగా విద్యాసంస్థలు స్థాపించి ఈరోజు విద్యార్థులను విద్యార్థులను,తల్లిదండ్రులను అధిక ఫీజులతో,పుస్తకాల పేరుతో లక్షల,కోట్ల రూపాయలు దందా చేస్తున్న కూడా ఏమి పట్టనట్టుగా నిద్రమత్తులో వ్యవహరిస్తున్నటువంటి జిల్లా విద్యాశాఖ అధికారులు. ఈ మధ్యకాలంలో ఎసఎఫఐ గా ఆందోళనలు చేస్తున్న,అన్ని వార్తాపత్రికల్లో ఈ యొక్క అరాచకాల పైన వస్తున్న కూడా ఏమీ తెలియనట్టుగా ఉంటున్నారు. దీని ద్వారా కడప విద్యాశాఖ అధికారులు జిల్లాలో ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలకు వారిచ్చే కాసులు తీసుకొని తొత్తుగా వ్యవహరిస్తున్నారేమో అని అనుమానం వ్యక్తం చేశారు. అన్ని జిల్లాలలో కూడా అధిక ఫీజుల పైన పుస్తకాల పేరుతో దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న కూడా ఏమీ తెలియనట్టుగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు ప్రవర్తించడం జరుగుతా ఉంది.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో భాగంగా ఇచ్చినటువంటి హామీ ప్రకారం ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు అధికారంలోకి వచ్చిన వెంటనే కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికడదామని చెప్పారు . కానీ అధికారం వచ్చి సంవత్సరం రోజులు వచ్చినా కూడా దానిపైన ఆలోచన లేకుండా పోయింది. దీన్నిబట్టి చూస్తే ప్రస్తుత కూటమీ ప్రభుత్వం ప్రైవేట్ మరియు కార్పొరేట్ శక్తులకు కుమ్ముకొస్తుందని వారన్నారు. ఇప్పటికైనా కడప జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో లేచి చదువు పేరుతో వ్యాపారం చేసే విద్యాసంస్థలపై కఠినమైన చర్యలు తీసుకొని, సీజ్ చేసి, పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని లేనిపక్షంలో రాబోవు రోజుల్లో ప్రతి మండల, నియోజకవర్గంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, కడప నగర కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ రోడ్ సేఫ్టీ వార్షికోత్సవాలు






బద్వేల్, నియోజకవర్గం రిపోర్టర్ - శివారెడ్డి,(శుభోదయంన్యూస్): నేషనల్ రోడ్ సేఫ్టీ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం రోజు జిమ్ రెన్యువబుల్ విండో మిల్స్ వారి ఆధ్వర్యంలో బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం.రాజగోపాల్ యాదవ్ ఎస్ఐ లు ఎం. సత్యనారాయణ కె. జయరామిరెడ్డి,మరియు సిబ్బంది, బద్వేల్ టౌన్ లోని ప్రజలతో కలిసి బద్వేల్ టౌన్ సిద్ధవటం రోడ్ లోని ఆర్టీసీ బస్టాండ్ నుండి నెల్లూరు రోడ్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ వారకు ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ర్యాలీ చేయడమైనది. అలాగే ఇండియన్ ఆయిల్ పెట్రోల్ స్టార్ ఏర్పాటు చేసి కేజీ ప్లాస్టిక్ కేజీ బియ్యం ఇవ్వబడినది. అక్కడ బద్వేల్ పోలీస్ వారు మీటింగ్ ఏర్పాటు చేసి బద్వేలు టౌన్ ను ప్లాస్టిక్ రహిత సమాజంగా బద్వేలు తీర్చి దిద్దడానికి ప్రజల సహకరించాలని అవగాహన కల్పించడమైనది.

# మహిళల్ని అవమానించిన వారు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయం







గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : సాక్షి విలేఖరి కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు లపై గన్నవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుసాక్షి దినపత్రిక ప్రతులను దగ్ధం చేసిన గన్నవరం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి మహిళా నేతలు..సాక్షి మీడియా యాజమాన్యం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మూల్పురి సాయి కళ్యాణి..ది 06.06.2025, శుక్రవారం సాక్షి టీవీ నందు లైవ్ డిబేట్లో కొమ్మినేని శ్రీనివాసరావు మరియు కృష్ణంరాజు అనే వ్యక్తులు అమరావతి ప్రాంత మహిళలను వేశ్యలుగా మరియు సెక్స్ వర్కర్లుగా పేర్కొంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఈరోజు సాయంత్రం గన్నవరం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి మహిళా నాయకులు స్థానిక శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అమరావతి పరిరక్షణ సమితి నాయకురాలు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీమతి కంభంపాటి శిరీష మాట్లాడుతూ సాక్షి అనే బోగస్ ఛానల్ లో కొమ్మినేని శ్రీనివాస్ కృష్ణంరాజు అనే వ్యక్తులు అమరావతి మహిళలపై అత్యంత జుగుప్సాకరంగా లైవ్ డిబేట్లో మాట్లాడారని, గత వైసిపి ప్రభుత్వ పాలనలో కూడా అమరావతి రాజధానిని నాశనం చేసేందుకు ఎన్నో రకాలుగా అబాండాలు మోపారని, కానీ ప్రజలు వాటిని నమ్మకుండా వైసిపికి బుద్ధి చెప్పారని తెలిపారు. ఘోరంగా ఓటమి చెందిన వైసిపి పార్టీకి ఇంకా బుద్ధి రాలేదని అహంకారం తగ్గలేదని దానికి నిదర్శనమే ఈరోజు సాక్షి టీవీలోని డిబేట్లో అమరావతి మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలని అన్నారు. వేశ్యల రాజధాని అమరావతి అయితే సాక్షి మీడియాకు అధిపతిగా ఉన్న భారతీ రెడ్డి నివాసం ఉంటుంది కూడా అమరావతి ప్రాంతంలోని తాడేపల్లిలోనే అని తెలిపారు. అమరావతి నగర పరిధిలో 60 శాతం దళితులు ఉండే ప్రాంతమని, సాక్షి మీడియాలో వేశ్య రాజధాని అని పోలుస్తున్నది ఈ ప్రాంతంలో నివసిస్తున్న దళిత మహిళలననే అని, దళితుల పట్ల వారికి ఉన్న అభిప్రాయం అలాంటిదని ఆమె తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతి రాజధాని మహిళలు సగర్వంగా తలెత్తుకుని తిరుగుతున్నామని, కానీ ఇంకా కాలకేయుల లాంటి సాక్షి మీడియా ప్రతినిధులు తమను వెంటాడుతూనే ఉన్నారని ఇది తట్టుకోవడం అమరావతి ప్రాంత మహిళలకు చాలా కష్టంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కొమ్మినేని శ్రీనివాస్ కృష్ణంరాజులు అమరావతిలో ఏసియావృత్తులు సాగిస్తున్నారని రిహాబిలిటేషన్ సెంటర్లు ఉన్నాయని వ్యాఖ్యానించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారి ఇంటిలో సైతం మహిళలు ఉంటారని వారు కూడా ఇలాగే సంపాదించి మీకు ఇస్తున్నారా అని సూటిగా ప్రశ్నించారు. ఆత్మగౌరవం చచ్చిపోయే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ టిడిపి కార్యకర్తలుగా క్రమశిక్షణతో వ్యవహరిస్తున్నామని కానీ పదేపదే రెచ్చగొట్టే విధంగా మీడియాలో అవమానించడం సరికాదని అన్నారు. వారితో ఇలా మాట్లాడించడం పట్ల కుట్ర దాగి ఉందని అమరావతి మహిళలకు భారతి రెడ్డి క్షమాపణ చెప్పాలని అన్నారు. వెంటనే సాక్షి మీడియా స్పందించి ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలందరూ కూడా ఇలాంటి వ్యాఖ్యలను ఖండించి, అపర కాళీల్లాగా వారికి సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మూల్పురి సాయి కళ్యాణి మాట్లాడుతూ..రెండు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడువనం మహోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతూ అమరావతి అనేది దేవతలు నడయాడిన ప్రజా రాజధాని అంటూ వ్యాఖ్యానించారు అని, దానిపై సాక్షి మీడియా ఛానల్లో నిర్వహించిన డిబేట్లో వ్యాఖ్యాతిగా వ్యవహరించిన కొమ్మినేని శ్రీనివాస్ అనే విలేకరి చర్చే వేదిక నిర్వహించి అమరావతి ప్రాంత మహిళలను ఘోరంగా అవమానిస్తూ మాట్లాడారని దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు సాక్షి మీడియా డిబేట్ నిర్వాహకుడు కొమ్మినేని శ్రీనివాస్ గతంలో కూడా పలుమార్లు అమరావతి రాజధాని మహిళలపై అసభ్యకరంగా మాట్లాడారని అన్నారు. డిబేట్లో పాల్గొన్న కృష్ణంరాజు అనే వైసిపి పార్టీకి చెందిన నాయకుడు మాట్లాడుతూ అమరావతి మహిళలే కాదు చుట్టు ప్రక్కల నివసిస్తున్న మహిళలు కూడా వైశ్యులు, సెక్సువల్ వర్కర్స్ అని మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులుగా అత్యంత నీచంగా సంబోధించారని, దీనిని ప్రజాస్వామ్యంలోని ప్రజలందరూ ఖండించాలని అన్నారు. కృష్ణంరాజు అనే వ్యక్తి సైతం అమరావతి పరిసర ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని వారి ఇంటిలో సైతం మహిళలు ఉంటారని వాళ్లు కూడా స్పందించి ఇలాంటి వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు అనే వ్యక్తిని చెప్పుతో కొట్టి బుద్ధి చెప్పాలని సూచించారు. సాక్షి మీడియా కి అధిపతిగా ఉన్న వైయస్ భారతి రెడ్డి సైతం ఒక మహిళే అని, మహిళల గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటే సాక్షి హెడ్ గా ఉన్న భారతీ రెడ్డి కనీసం ఖండించలేదని, కానీ భారతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడనే ఆరోపణలపై తెలుగుదేశం పార్టీ కార్యకర్త కిరణ్ అనే వ్యక్తిని తెలుగుదేశం పార్టీ నుండి సస్పెండ్ చేసి పోలీస్ కేసు పెట్టి, జైల్లో పెట్టామని తెలుగుదేశం పార్టీకి మహిళలపై ఉన్న గౌరవం అలాంటిదని తెలిపారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసేవారిని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించరని అలాంటి దమ్ము వైసిపి నాయకులకు ఉందా అని సూటిగా ప్రశ్నించారు. కొమ్మినేని శ్రీనివాస్ అనే వ్యక్తిని వెంటనే సాక్షి మీడియా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ గతంలో మహిళలపై జరిగిన దాడులను ప్రోత్సహించే వారిని, ఆంధ్రప్రదేశ్ కు రాజధాని ఉండటం కంపెనీలు వచ్చే రాష్ట్రం అభివృద్ధి చెందడం జగన్ కు ఇష్టం లేదని దానిని గ్రహించే రాష్ట్ర ప్రజలు ఘోరంగా ఓడించినా ఇప్పటికీ బుద్ధి రాలేదని విమర్శించారు. స్వయానా తన చెల్లికి, తల్లికి న్యాయం చేయలేని వ్యక్తి వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అని ఇంకా రాష్ట్రంలో మహిళల గురించి ఆయన ఎలా ఆలోచిస్తారని విమర్శించారు. ఇప్పటికైనా సాక్షి యాజమాన్యం స్పందించి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ డిబేట్లు నిర్వహిస్తున్న సాక్షి విలేఖరి కొమ్మినేని శ్రీనివాస్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని లేకపోతే సాక్షి మీడియాను రాష్ట్రంలో లేకుండా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.గన్నవరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ, బిజెపి మహిళా మోర్చా నాయకురాలు కానూరు శేషు మాధవి, జనసేన వీర మహిళ మేకల స్వాతితదితరులు మాట్లాడుతూ ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు ఉంటారని, కానీ వైసీపీ మీడియా సాక్షి ఛానల్ లో అనునిత్యం మహిళలను కించపరిచే విధంగా కథనాలు వస్తున్నాయని సాక్షి మీడియాలో రాజధాని అమరావతి మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను గన్నవరం మహిళా కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మహిళల మనోభావాలు దెబ్బ తినే విధంగా డిబేట్లు నిర్వహిస్తున్నందుకు సాక్షి మీడియా మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.అమరావతి రాజధాని మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ సాక్షి టీవీ ఛానల్ లైవ్ డిబేట్లో అనుచిత వ్యాఖ్యలు చేసినచేసినందుకు కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గన్నవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.అనంతరం

సాక్షి దినపత్రిక ప్రతులను దగ్ధం చేస్తూ, సాక్షి మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశార

ు.ఈ కార్యక్రమంలో నెక్కంటి శ్రీదేవి, బొమ్మసాని అరుణ కుమారి, స్వర్ణ కుమారి, తుపాకుల శివలీల, బడుగు ఝాన్సీ, రమ్య, నాగమణి, యశోద, లావణ్య, చేబత్తిన సుజాత, లక్ష్మి, బి.సుకన్య తదితరులు పాల్గొన్నారు.

## చెడు నడత కలిగిన షీట్ హెూల్డర్స్ కు కౌన్సిలింగ్



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): జిల్లాలో నేరాల నివారణకు, చెడు నడత కలిగిన వ్యక్తుల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి, మరియు సమాజంలో శాంతి భద్రతలను మెరుగుపర్చడానికి నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఈ చర్యలలో భాగంగా, వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసించే రౌడీలు, డీసీలు, కేడీ, మరియు సస్పెక్ట్ షీట్ హెూల్డర్స్‌ను గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌లో వారికి సత్ప్రవర్తన మరియు చట్టపరమైన జీవన విధానాన్ని అవలంబించాలనే సందేశం అందజేశారు. భవిష్యత్తులో నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు.మరలా మరలా నేరాలను పునరావృతం చేసే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని స్పష్టం చేశారు. చెడు నడత కలిగిన వారి యొక్క ప్రవర్తనలో మార్పు వచ్చేలా చేయడమే కాకుండా, భవిష్యత్తులో సమాజానికి మంచి సేవలను అందించాలని వారికి అవగాహన కల్పించారు. అలాగే, జిల్లా పోలీస్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి వ్యక్తికి తమ బాధ్యతలను వివరించి, నేర నిరోధానికి అవసరమైన చర్యలను వివరిస్తూ వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## అమ్మా.. మీకు అండగా ఉంటాం' కలవగుంట భరత్ రెడ్డి



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): అమ్మా...! మీకు అండగా ఉంటాం. మెహర్ కుమార్ మా స్నేహితుడు. మా శ్రేయోభిలాషి ఆయన లేని లోటు మీకు తీర్చుతాం. మమ్మల్ని కూడా మీ బిడ్డలుగా భావించు" అని ప్రముఖ సంఘ సేవకులు కలవగుంట భరత్ రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండల వార్త దినపత్రిక విలేకరి చిట్టత్తూరు మెహర్ కుమార్ ఇటీవల ఆకస్మికంగా తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కర్మక్రియలు ఆదివారం శ్రీకాళహస్తి పట్టణం కొండమిట్టలో జరిగాయి. ఈ కర్మక్రియలకు సంఘ సేవకులు కలవగుంట భరత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మెహర్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. అనంతరం మెహర్ కుమార్ మాతృమూర్తిని ఓదార్చారు. ఆమెకు కొంత ఆర్థికసాయం చేశారు. మెహర్ కుమార్ కుమార్ ఒక్కడే కుమారుడు కాదని... తమను కూడా కుమారుల్లా స్వీకరించాలన్నారు. అతడు లేని లోటును తీర్చుతామన్నారు. ఎపుడు అవసరమైనా తమను సంప్రదించాలని ఆమెకు సూచించారు. మెహర్ కుమార్ తో తమకు ఉన్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మెహర్ సామాజిక బాధ్యత కలిగిన పాత్రికేయుడని... ఆయన రాసిన కథనాలతో ఎంతోమందికి న్యాయం జరిగిందని కొనియాడారు. ఆయన ప్రజలకు చేసిన మేలు పుణ్యం ప్రాప్తించేలా చేస్తుందని కలవగుంట భరత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు ధనశేఖర్, హరి, మునిశేఖర్, చంద్ర, బాలు, మునిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



## జగన్ రెడ్డి క్షమాపణలు చెప్పాలి : నివేదిత మోరె



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్):ఆంధ్రుల కలల రాజధాని అయిన అమరావతి నిర్మాణ పనులు వేగం పుంజుకోవడాన్ని చూసి జీర్ణించుకోలేక తన సాక్షి ఛానల్ చర్చా కార్యక్రమంలో మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయించిన జగన్ రెడ్డి తక్షణమే క్షమాపణలు చెప్పాలని శ్రీకాళహస్తి పురపాలక సంఘం,18 వ వార్డు మాజీ కౌన్సిలర్ డా.నివేదిత మోరె డిమాండ్ చేశారు.సాక్షి ఛానల్ లో జరిగే ఏ చర్చా కార్యక్రమమైన జగన్ రెడ్డి డైరెక్షన్ లోనే జరుగుతుంది. ఈరోజు కూడా అమరావతిని కించపరుస్తూ, అమరావతి మహిళల శీలహననం చేయించిన జగన్ రెడ్డిని సంఘం నుండి బహిష్కరించాలని యావత్ భారతీయ సమాజానికి విజ్ఞప్తి చేశారు.అమరావతిలో జగన్ రెడ్డి పాలనా కాలంలో జరిగిన అరాచకాలను జగన్ రెడ్డి పైన,మీడియాలో మాట్లాడిన వారి పైన,సాక్షి యాజమాన్యం పైన మహిళా కమిషన్, యస్సీ, యస్టీ మరియు మానవ హక్కుల కమిషన్ క్రిమినల్ కేసులు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, శ్రీకాళహస్తి పురపాలక సంఘం,18 వ వార్డు మాజీ కౌన్సిలర్ డా.నివేదిత మోరె, తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్పింగ్ హాండ్స్ సంస్థ సేవలు మరువలేనివి




శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): గత హెల్పింగ్ హాండ్స్ సంస్థ చేస్తున్నటువంటి సేవలు మరువలేనివి160 నెలలుగా హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగులకు, ప్రత్యేక ప్రతిభావంతులకు, వృద్ధులకు,పేదలకు నెలకు సరిపడు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తూ ఉన్నారు. అందులో భాగంగా ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని నగిరి వీధిలో చిల్డ్రన్స్ ఫ్యాన్సీ స్టోర్ వద్ద 161 వ నెల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది గరికపాటి రమేష్ బాబు మాట్లాడుతూ పేద ప్రజలకు, మానసిక దివ్యాంగులైన 35 కుటుంబాలకు హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ వ్యవస్థాపకులు మునీర్ భాష 161 నెలలుగా నిరంతరం నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తుండడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు వచ్చి పేదలకు, దివ్యాంగులకు, వృద్ధులకు తమ వంతు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్ సంస్థ వ్యవస్థాపకుడు మునీర్ భాష, బాబా ఫరీద్, హరినాథ్ నాయుడు, హెల్పింగ్ హాండ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## గన్నవరం నియోజకవర్గంలో పరిశ్రమల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : గన్నవరం నియోజకవర్గంలో పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్పు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆదివారం ఉంగుటూరు మండలం వెన్నుతుల గ్రామంలో పామర్తి సుబ్బారావు తన స్నేహితులతో కలిసి స్థాపించిన (యూపిఎస్) యూనివర్సల్ ప్రింట్ సిస్టమ్ కంపెనీని లాంఛనంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తొలుత కంపెనీ ఆవరణలో ఉన్న ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ స్నేహితులతో కలిసి ప్రారంభించిన ఈ కంపిని వృద్ధిలోకి రావాలని అన్నారు. యుపిఎస్ యూనివర్సల్



ప్రింట్ సిస్టం కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతూ సూరంపల్లి గ్రామంలో ఇటు వెన్నూ తల గ్రామంలో ఈ కంపెనీని ప్రారంభించడం శుభపరినామమని దీనివలన ఎంతోమందికి ఉపాధి కలుగుతుందని ఆ కంపెనీ యాజమాన్యాన్ని అభినందించిన యార్లగడ్డ వెంకట్రావు గన్నవరం నియోజవర్గం అభివృద్ధి గా అడుగులు వేస్తుందని ఇప్పటికే మల్లవల్లి పారిశ్రామిక వాడలో మంచి మంచి కంపెనీలు రావటంతో ఎంతోమందికి ఉపాధి కలిగిందని అలాగే మన తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాదు లోనే జీడిమెట్ల లాగా మల్లవల్లి కూడా మంచి కంపెనీలు వస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ కి తలమానికంగా ఉంటుందని ఆయన అన్నారు గన్నవరం నియోజవర్గం అభివృద్ధి ఎజెండగా పనిచేయడమే తన లక్ష్యమని ఆయన అన్నారు ఎన్నికల ముందు యువతకి ఉపాధి కల్పిస్తానని చెప్పా అదే దిశగా పనిచేస్తున్న తన నియోజకవర్గంలో ఎవరు కంపెనీ ఏర్పాటు చేస్తానన్నా నేను సహకరిస్తా అని ఆయన అన్నారు అలాగే గ్రామాల్లోని రైతు సోదరులు చెరువుల మట్టిని పొలాల్లోకి మెరక చేసుకోవడానికి అవకాశం వచ్చిందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో బ్యాంకర్లు, సమీప గ్రామాల ప్రజలు కంపెనీ ప్రతినిధులు, యాజమాన్యం పాల్గొన్నారు.

## అమరావతి మహిళలను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలి



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : అమరావతి పునః నిర్మాణాన్ని జీర్ణించుకోని సాక్షి మీడియా దుష్ప్రచారాలకు తెరలేపుతూ అందులో భాగంగా లైవ్ డిబేట్లు నిర్వహిస్తూ అమరావతి మహిళలను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులను చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కోరుతూ టీడీపీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు స్థానిక పోలీస్ స్టేషన్లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి అనే బోగస్ ఛానల్ లో అమరావతి మహిళలపై జుగుప్సాకరంగా వారు మాట్లాడటం గర్హనీయమని, మహిళలను అవమానిస్తే ఎంతటి వారైనా కాలగర్భంలో కలిసిపోతారన్నారు. వైకాపా మీడియా తొలి నుంచి అమరావతిపై విషం చిమ్ముతూ వాస్తవాలు వక్రీకరిస్తూ అసత్య ప్రచారాలు చేస్తోందని బౌద్ధ క్షేత్రంగా, రాజుల కాలంలో రాజధానిగా అమరావతి శోభిల్లందన్న వాస్తవాలు మరిచి దుష్ప్రచారానికి పూనుకుందని విమర్శించారు. వైకాపా అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలు అమరావతి ప్రాంతాన్ని శ్మశానంతో పోల్చి , త్యాగాలు చేసిన రైతులను నానా ఇబ్బందులు పెట్టారని, ప్రజలు ఓడించినా వైకాపా తీరు మారక పోగా మరింత దిగజారిందని గ్రహించాలన్నారు. మహిళలను అవమానించిన కార్యక్రమ నిర్వాహకులు, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ ఐ నాగార్జునకు ఫిర్యాదు అందించిన వారిలో సుమంత్ రెడ్డి, రామకృష్ణ, లింగా మాధవరావు తదితరులున్నారు.

## సత్రశాల క్షేత్రానికి సరికొత్త శోభ కృష్ణవేణి

- వైభవంగా కృష్ణవేణి విగ్రహ ప్రతిష్ఠ

/- గ్రామాల్లో పచ్చదనం పరవళ్ళు తొక్కాలి : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : పురాతన శైవక్షేత్రం సత్రశాలలో ఆదివారం కృష్ణవేణి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా జరిగిన ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందాల కృష్ణవేణి పురాతన క్షేత్రానికి సరికొత్త శోభను తెచ్చి పెట్టిందన్నారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు కృష్ణవేణి దర్శన భాగ్యం మధురానుభూతిని కలిగిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటి మాట్లాడుతూ భవిష్యత్ తరాలు ఆరోగ్యకరంగా జీవించేందుకై ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రతి గ్రామంలో పచ్చదనం పరవళ్ళు తొక్కాలని అభిలషించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.



### వివాహ కార్యక్రమానికి హాజరైన.....

### ఎమ్మెల్సీ శివరామి రెడ్డి అనంత వెంకటరామిరెడ్డి, మెట్టు విశ్వనాథ్ రెడ్డి



కనేకల్లు, మండల విలేకరి - మాల్యం కిరణ్ కుమార్, జూన్ 9 (శుభోదయం న్యూస్) : ఎమ్మెల్సీ



శివరాం రెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి, మెట్టు విశ్వనాథ్ రెడ్డి లుఆదివారం కనేకల్ మండలం హనకన హల్లుగ్రామ లో నాగన్న కూతురు పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైసిపిమండల కన్వీనర్ మండల ప్రజా ప్రతినిధులు హాజరయ్యా, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు..!

## మహిళలంటే ఇంత చులకన జర్నలిస్టులు

### కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై కేసు నమోదు చేయాలి



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు, జూన్ 9 (శుభోదయం న్యూస్): మహిళల పట్ల ఇంత నీచంగా ప్రవర్తిస్తున్న జర్నలిస్టులో కొమ్మినేని శ్రీనివాసరావు కృష్ణంరాజులను అరెస్ట్ చేయాలని పట్టణ తెలుగుదేశం పార్టీకి చెందిన మహిళలు ఆదివారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో సిఐ మనోహర్ కు ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా కూటమి మహిళలు మాట్లాడుతూ మీ ఇంటి ఆడపడుచులు కూడా వేశ్యలుగానే చూస్తారా అని ప్రశ్నించారు అమరావతి మహిళలను ఇలా అవమానించడం బాధాకరమన్నారు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన సాక్షి ఛానల్ లో ఇలాంటివి వీళ్ల చెప్పించుతున్నారని ఆరోపించారు ఐదు సంవత్సరాలు రాజధాని కోసం అమరావతి కోసం ఎదిరించి పోరాడిన మహిళా రైతులు వీర మహిళలు రోజు రోజుకు దిగజారుడు రాజకీయాలు చేస్తున్న నిన్ను ఏదో ఒక రోజు ఈ మహిళలే ఆదా పాతాళానికి తొక్కేస్తారని ఆడవారిని అవమానించిన వారికి పుట్టగతులు ఉండవని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు మహిళలను ఇంత నీచంగా మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాసరావు కృష్ణంరాజులు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## కంప్యూటర్ పై పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి అవసరం : టీ జయన్న



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 9 (శుభోదయం న్యూస్) : ప్రస్తుత కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అని యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ డైరెక్టర్ ఆదివారంస్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ లో వేసవి కాలం సెలవుల్లో శిక్షణ పొందిన 150 మంది విద్యార్థులకు శస్త్ర జూనియర్ కళాశాలలో థియరీ పరీక్షలు నిర్వహించినట్లు సంస్థ డైరెక్టర్ టి.జయన్న ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పరీక్ష పత్రాలను కళాశాల కరస్పాండెంట్ బి.శేఖర్ మరియు గుత్తి బ్రాంచి డైరెక్టర్ అరుణ్ కుమార్ విడుదల చేశారు.ఈ పరీక్ష లను గుత్తి బ్రాంచి డైరెక్టర్ అరుణ్ కుమార్ పర్యవేక్షణలో సజావుగా జరిగాయి.పరీక్షలు అనంతపురం సంస్థ డైరెక్టర్ జయన్న మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతీ విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి మారుతున్న టెక్నాలజీ పరంగా ప్రతీ ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరుచుకొని నూతన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉండాలని తెలిపారు.అదేవిదంగా వేసవి కాలం శిక్షణ తదనంతరం డిగ్రీ, డిప్లొమా, బిటెక్ విద్యార్థులకు నిరుద్యోగులకు కంప్యూటర్ శిక్షణ ను కొనసాగిస్తూ వారిని స్వయం ఉపాధి వైపు అడుగులు వేయించడం జరుగుతున్నదని గత 19 సంవత్సరాలుగా ఎంతోమంది నిరుద్యోగులు శిక్షణ పొంది వివిధ రంగాలలో స్థిరపడినట్లు జయన్న తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎక్జామినర్ నరేష్ మరియు సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన ప్రసాద వితరణకు 25 వేలు విరాళం ఇచ్చిన..... 70 ఏళ్ల వృద్ధురాలు భానుమతి



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 9 (శుభోదయం న్యూస్) : శ్రీ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయానికి 70 ఏళ్ళు వయసు ఉన్న వృద్ధురాలు భానుమతి 25వేల రూపాయల విరాళాన్ని అన్నదాన వితరణ దేవాలయ వ్యవస్థాపకుడు తలారి పరుశురాం దంపతులకు ఆదివారం అందించారు ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు తలారి పరశురాం మాట్లాడుతూ ఆలయం దినదిన అభివృద్ధి చెందుతున్నదని ఆలయములో వివాహాలు కూడా జరుపుకోవాలని ఆయన



కోరారు ఇది అందరి దేవాలయమని ఆయన పేర్కొన్నారు.

## ఆర్డిటిని కాపాడుకుందాం : వై వెంకట్రామిరెడ్డి




గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 9 (శుభోదయం న్యూస్): పేదల అభ్యున్నతి కోసం జిల్లాలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆర్డిటి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు ఆదివారం మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆర్డిటి పరిరక్షణకు చేపట్టిన పాదయా త్రకు వై వెంకట్రామిరెడ్డి తన పూర్తి మద్దతు తెలిపారు సెట్టూరు మండలం కైవూరు గ్రామం వద్ద పాదయాత్ర చేస్తున్న తలారి రంగయ్య ను పరామర్శించారు ఈ సందర్భంగా వై.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆర్డిటిని 1960లో విన్సెంట్ పెర్రర్ స్థాపించాడని రాయలసీమలోని వెనుకబడి ఉన్న గ్రామాలలో అభివృద్ధి చేశారన్నారు ముఖ్యంగా పేద విద్యార్థులను ఎన్నో ఉన్నత చదువు లుచదివించి గొప్పవాళ్ళం చేశారన్నారు ఎందరో విద్యార్థులకు స్కాలర్షిప్లను మంజూరు చేశారన్నారు పేద విద్యార్థులకు ఆర్థికంగా సామాజికంగా వారు అందించిన సేవలు మర్చిపోలే నివి అని ఆయన పేర్కొన్నారు వికలాంగులకు కూడా ఎంతో చేయూతనిచ్చారని కొనియాడారు కేంద్ర ప్రభుత్వం తప్పకుండా దిగి వస్తుందని ఆర్డిటి సమస్త పూర్వ వైభవం పొందుతుందన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ వైసీపీ నాయకులు దశరథ రామిరెడ్డి మాజీ సర్పంచ్ తిక్క స్వామి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిట్రగుంటలో ముగిసిన వేసవి ఫుట్బాల్ శిక్షణాశిబిరం



బిట్రగుంట, (శుభోదయం న్యూస్): నెల్లూరు జిల్లా క్రీడాప్రాధికారసంస్థ ఆదేశాల మేరకు బిట్రగుంట రైల్వే క్రీడామైదానంలో 11సంవత్సరాలనుండి16 సంవత్సరాలలోపుపిల్లలకునెలరోజులపాటునిర్వహించినవేసవిఫుట్బాల్ శిక్షణశిబి రంఆదివారంతోముగిసింది.సీనియర్ ఫుట్బాల్ క్రీడాకారుడుఎస్.కె.నవీద్ ఆధ్వర్యంలోసుమారు65మందిపిల్లలకు రెండుగ్రూపులుగానెలరోజులపాటుసీనియర్ క్రీడాకారులుదీపక్,కిరణ్ శిక్షణఇచ్చారు.శిక్షణపొందిన క్రీడాకారులకుబి.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోయువసేనఅధ్యక్షుడుషమి బూట్లు,నిక్కర్లు,బనియన్లుపంపిణీ చేశారు.అనంతరంబిట్రగుంటకు చెందినజాతీయఫుట్బాల్ క్రీడాకారుడు,చెన్నైఇండియన్ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగిమహేంద్ర (మను)నుఘనంగా సన్మానించారు.పైకార్యక్రమంలో బిట్రగుంటఫుట్బాల్ క్రీడాకారులు, క్రీడాభిమానులుతదితరులు పాల్గొన్నారు.

### దళిత బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

### మాల మహానాడు రాష్ట్ర మహిళా కార్యదర్శి కల్లమడి పుష్పాంజలి




గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 9 (శుభోదయం న్యూస్): దళిత బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర మహిళా కార్యదర్శి కల్లమడి పుష్పాంజలి డిమాండ్ చేశారు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రామగిరి మండలం ఏడు గుర్రాల పల్లిలో 9వ తరగతి చదువుతున్న దళిత విద్యార్థి నీపై అదే గ్రామానికి చెందిన కొందరి యువకులు అఘాయిత్యానికి పాల్పడ్డారనిదాదాపు 14 మంది వారి ఇష్టం వచ్చినప్పుడల్లా అఘాయిత్యం చేశారని బాలిక గర్భవతి కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని ఇలాంటి కీచకుల పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించాలని ఆమె కోరారు.

## వైయస్సార్సీపి అభిమానిని పరామర్శించిన.... వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు, జూన్ 9 (శుభోదయం న్యూస్): వైసీపీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే స్పందించే మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి కుటుంబం ఇందులో భాగంగా ఆదివారం పామిడి పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన వైఎస్ఆర్సిపి పార్టీ అభిమాని ఓబులేసు ను వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి పరామర్శించారు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, సర్పంచ్ నాగేశ్వర్ రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు డాక్టర్ బాబు జగజ్జివన్ రావు విగ్రహావిష్కరణ సభ




గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : చిక్కవరం గ్రామం శివారు చింతకుంట్ల గ్రామంలో రేపు అనగా 9వ తేదిన సాయంత్రం 4 గంటలకు జరగబోయే మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జివన్ రావు విగ్రహావిష్కరణ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మరియు కృష్ణాజిల్లా ఇన్చార్జి జలదంకి నరశింగరావు మాదిగ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మ అవార్డు గ్రహీత శ్రీ మందకృష్ణ మాదిగ విచ్చేయుచున్నారు కాబట్టి నియోజకవర్గంలో ఉన్నటువంటి మాదిగ మాదిగ ఉప కులాలు మరియు అలాగే ప్రజాస్వామిక వాదులు ప్రజా సంఘ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి కోట కృష్ణమోహన్ మాదిగ, గన్నవరం నియోజకవర్గ ఎంఎస్పి ఇన్చార్జి మంద వేణు మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లామ్ మాదిగ, రుద్రయ్య మాదిగ, రమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# నిండుకుండలా నీరున్న నిరుపయోగమే

## సాగర్ జలాలు తాగేది ఎన్నడు
## బిల్లులు మార్చుకోవడమే తప్ప నీటి సరఫరాలేదు
## పట్టుమని పది గ్రామాలు కూడా చేరని నీరు
## సమ్మర్ స్టోరేజ్ ని సందర్శించిన సీపీఐ బృందం



యర్రగొండపాలెం, నియోజకవర్గ ఇంచార్జి - కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్): మండలంలోని ముటుకుల సమ్మర్ స్టోరేజ్ లో నిండు కుండలా నీరు ఉన్నా నిరుపయోగమేనని, బిల్లులు మార్చుకోవడానికే తప్పా నీరు సరఫరా జరగటం లేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య మండిపడ్డారు. ఆదివారం మండలంలోని ముటుకుల సమ్మర్ స్టోరేజ్ ని సీపీఐ బృందం తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల దృష్ట్యా కరువు కాటకాలతో అల్లాడుతున్న మండల ప్రజల కోసం కోట్ల రూపాయలు వెచ్చించి సమ్మర్ స్టోరేజ్ ని



ఏర్పాటు చేశారని అన్నారు. కాని కార్యరూపం దాల్చలేదని అప్పటి నుండి ఇప్పటి వరకు పట్టుమని పది గ్రామాల కూడా నీరు అందటం లేదు. వేసవికాలం ట్యాంకర్ల చూపే శ్రద్ధ సమ్మర్ స్టోరేజ్ నీటి సరఫరా పై చూపిస్తే నీటి కొరత నివారించవచ్చు అని అన్నారు. మండలం నుండి జిల్లా అధికారుల వరకు ముందస్తు నీటి కొరత నివారించెందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పటం తప్పా నీటి సమస్యలు నివారించేందుకు అధికారులు విఫలం అయ్యారని అన్నారు. పుల్లలచెరువు మండల కార్యదర్శి జి.గురునాధం మాట్లాడుతూ చెరువు చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించలేదని, నీటి సరఫరా విషయంలో ఫిల్టర్ లు కూడా సరీగా పని చేయటం లేదన్నారు. గ్రామాల్లో నెలకొన్న సంపులు ఓవరేట్ ట్యాంకర్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రత చేయాలని అన్నారు. గత ప్రభుత్వంలో కూడా నిధులు మార్చుకొని గాలికి వదిలేశారేం తప్పా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వారు ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను సమన్వయ పరచి సమ్మర్ స్టోరేజ్ పరిధిలో ఎక్కడైతే మరమ్మతులు చేపట్టాలో, పైపు లైన్లు పరిశీలించి అన్ని గ్రామాలకు సాగర్ జలాలు అందించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. గతంలో ఈ ప్రాజెక్టు ను జిల్లా కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్, ప్రజా ప్రతినిధులు సందర్శించారే తప్పా పట్టించుకున్న నాథుడే లేదని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఐ యర్రగొండపాలెం మండల కార్యదర్శి మన్నే సాంబశివరావు, యర్రగొండపాలెం మండల సహాయ కార్యదర్శి వై వెంకట శివయ్య, పుల్లలచెరువు సీపీఐ మండల సహాయ కార్యదర్శి గుంటూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల శాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు..

## జొన్నగిరి ఎస్సై మల్లికార్జున



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్): మండల పరిధిలోని జొన్నగిరి పోలీస్ స్టేషన్లో ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ పులి శేఖర్,నేతృత్వంలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల శాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎన్ సీ.మల్లికార్జున హెచ్చరించారు. రౌడీ షీటర్ లందరికీ ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు నేరాళ్లకు పాల్పడిన,ప్రోత్సహించిన కఠిన చర్యలు తీసుకుంటామని అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే వారిపై గట్టి నిగా ఉందని రౌడీ షీటర్లకు తెలియజేశారు. సత్ ప్రవర్తన ఉన్న వారిపై ఉన్నతాధికారులకు రౌడీ షీటర్ తొలగించే నివేదికపంపిస్తాం మన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ను కలిసిన వెంకటపతి...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్): రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ను ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వెంకటపతి ను ప్రభుత్వము గిరిజన సలహా మండలి సభ్యులుగా నియమించడం జరిగింది. దీంతో ఉమ్మడి జిల్లా కు చెందిన మంత్రి బిసి జనార్దన్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు వెంకటపతి తెలిపారు. అలాగే నియోజవర్గ అభివృద్ధికి నిధులు ఎక్కువగా మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు.

# ఆర్థిక ఇబ్బందుల వలన ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్): మండలం పరిధిలోనే జొన్నగిరి గ్రామమునకు చెందిన రాంపల్లి సతీష్ (25) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు జొన్నగిరి ఎస్సై మల్లికార్జున తెలిపారు. హైదరాబాద్ లో చెత్త పని చేస్తూ జీవనం చేస్తూ ఉండేవాడని, ఇతనికి ఒక కొడుకు, ఒక కూతురు సంతానం కలదు అన్నారు. నెలరోజుల క్రితం మృతుని అమ్మ గోవిందమ్మ కు ఆరోగ్యం బాగాలేదని జొన్నగిరికి వచ్చారని, హైదరాబాద్లో చెత్త పని చేసుకోవడానికి బండి కొని మరియు తల్లి వైద్యం ఖర్చుల కోసం దాదాపు రూ 5 లక్షల వరకు అప్పు చేశాడని చాల సార్లు అప్పు కట్టలేక తండ్రి తో చెప్పి బాధపడుతుండేవాడని దీంతో శనివారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటి పైన ఉన్న రేకుల షెడ్డులో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని చనిపోయినాడు తెలిపారు. తండ్రి రాంపల్లి ఆంజనేయులు ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు.

# రద్దు చేసిన రైళ్లు ను తిరిగి పునరుద్ధరించాలి...

## సంతకాల సేకరణ చేపడుతున్న సిపిఐ నాయకులు...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): కరోనా సమయంలో రద్దుచేసిన రైళ్లను పునరుద్ధరించాలని సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్, సిపిఐ రైతు సంఘం నాయకులు ఉమాపతి లు రైల్వే అధికారుల ను కోరారు. ఆదివారం పెండేకల్ రైల్వే జంక్షన్ లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యం లో ప్రజా మద్దతును కూడగట్టేందుకు సంతకాల సేకరణ చేపట్టారు. కరోనా సమయంలో గుంతకల్ డివిజన్లో పలు ఆర్డినరీ రైళ్లను రద్దుచేయడం జరిగిందన్నారు. వాటిని తక్షణమే రైల్వే వారు పునరుద్దరించాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతంగా చేపడతామని హెచ్చరించారు.గతంలో గుంతకల్ నుంచి



కర్నూలు, విజయవాడకు, అలాగే బెంగళూరుకు, హుబ్లీ కు వెళ్లే ప్యాసింజర్ రైలు ఉండేవని వాటిని యధావిదంగా నడపాలని అన్నారు. అదేవిధంగా పెండేకల్లు జంక్షన్ నుండి వెళ్లే తిరుపతి బెంగళూరు ఎక్స్ప్రెస్ రైలు కూడా పెండేకల్లు లో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ శాఖ కార్యదర్శి సూరారెడ్డి, వెంకటేశ్వర్లు ,మద్దిలేటి, బాబు, పీరా, ప్రతాపు పాల్గొన్నారు.

# మైదుగోళంలో కార్యకర్తలతో సమావేశమైన మండల కన్వీనర్ అభిలాష్



లేపాక్షి, మండల రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్ ): హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ గారి ఆదేశాల మేరకు ఆదివారం లేపాక్షి మండలం మైదుగోళం పంచాయతీ లో స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులను,కార్యకర్తలను,అనుబంధ సంఘల నాయకుతో లేపాక్షి మండల కన్వీనర్ అభిలాష్ ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. మైదుగోళం టిడిపి నాయకులు నూతనంగా ఎన్నికైన మండల కన్వీనర్ అభిలాష్ కు సన్మానం చేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అభిలాష్ మాట్లాడుతూ అధ్యక్షునిగా నన్ను ఎన్నుకున్నందుకు సహకరించిన మీరందరూ మీకందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అన్నారు. కార్యకర్తే కన్వీనర్ అని, పార్టీ లో కష్టపడే ప్రతీ కార్యకర్తకు పార్టీ న్యాయం చేస్తుందన్నారు. అందరూ నాతో సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మైదుగోళం గ్రామ సర్పంచ్ రామచంద్ర రెడ్డి, ఖలీల్, మూర్తి, నాగరాజు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ దుర్గాదేవి ప్రెస్ క్లబ్ నిర్మాణానికి ఈడిగ రమేష్ విరాళం



లేపాక్షి, మండల రిపోర్టర్ - అమరేష్ (శుభోదయం న్యూస్): లేపాక్షి పంచాయతీ కార్యాలయం ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ దుర్గాదేవి ప్రెస్ క్లబ్ నిర్మాణానికి లేపాక్షి కి చెందిన ఈడిగ అంజనప్ప కుమారుడు లేపాక్షి తెలుగుదేశం పార్టీ నాయకుడు ఈడిగ రమేష్ యాభై వేల రూపాయలు ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. నిర్మాణం పూర్తయిన దశలో సహాయ సహకారాలతో పాటు మరింత వస్తువు రూపంలో కూడా సహకారం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం ఆయనకు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

# వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన దోర్నాల వైఎస్ఆర్సిపి నాయకులు





దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా దోర్నాల మండలం కడపరాజుపల్లి గ్రామంలో గోనుగుంట్ల ఆవులయ్య గారి కుమారుడు గోనుగుంట్ల వెంకటేశ్వర్లు వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన దోర్నాల మండలం వైఎస్ఆర్సిపి నాయకులు. అదేవిధంగా దోర్నాల మండలం చిన్న దోర్నాల గ్రామంలో ఎంపీటీసీ చింతలచెరువు వెంకటరెడ్డి మరియు శ్రీనివాస్ రెడ్డి గార్ల పోలేరమ్మ మొక్కుబడి కార్యక్రమంలో పాల్గొన్న దోర్నాల వైఎస్ఆర్సిపి నాయకులు ఈ కార్యక్రమంలో దోర్నాల మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ గంట వెంకట రమణారెడ్డి దోర్నాల మండలం ఎంపీపీ గుమ్మ పద్మజ యల్లేష్ మరియు దోర్నాల మండలం వైఎస్ఆర్సిపి నాయకులు అందరూ పాల్గొన్నారు

# డ్రైనేజ్ కాలువ సమస్యను పరిష్కరించాలి



దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య ( శుభోదయం న్యూస్): దోర్నాల మండలం ప్రకాశం జిల్లా దోర్నాల్లోని పెద్ద మసీదు వద్ద డ్రైనేజీ కాలువలో చెత్తాచెదారం చేరినందువలన మురికి నీరు రోడ్డు మీద పారుతున్నందువలన స్థానికులు చాలా ఇబ్బంది పడుతున్నారు కావున పంచాయితీ ఆఫీస్ వాళ్ళు దయవుంచి ఆ డ్రైనేజీ కాలువను శుభ్రం చేసి డ్రైనేజీ కాలువ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు మురికి నీరు నిల్వ ఉండడం వలన దోమలు సమస్య ఎక్కువగా ఉన్నదని అదేవిధంగా దోమల వలన అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని కావున ఈ డ్రైనేజీ కాలువను శుభ్రం చేసి మురికి నీరు నిలువ లేకుండా చేయాలని కోరుతున్నారు

# పేద విద్యార్థులకు పి.ఆర్.కె. ఫౌండేషన్ చేయూత

## గన్నవరంలో బ్యాగులు, పుస్తకాలు, ఆర్థిక సహాయం పంపిణీ



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : ముఖ్యమంత్రి చంద్రబాబు 'పి4' ఆదర్శంగా సేవా కార్యక్రమం నిర్వహించిన పారా రామకృష్ణ..గన్నవరం, విద్యార్థులకు అండగా నిలిచేందుకు పి.ఆర్.కె. ఫౌండేషన్ అధినేత పారా రామకృష్ణ గన్నవరం నియోజకవర్గంలో ఒక బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'పి 4' (పీపుల్, ప్రాఫిట్, ప్లానెట్, పార్టనర్‌షిప్) ఆదర్శంగా, యువ నాయకులు లోకేష్ ఆలోచనతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు పారా రామకృష్ణ ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా నిరుపేద విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, పుస్తకాలు అందజేశారు. అంతేకాకుండా, వారి చదువుకు ఆర్థికంగా తోడ్పాటునందించేందుకు 2,000, 1,500, మరియు 1,000 రూపాయల నగదు సహాయాన్ని పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, సమాజానికి మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షిస్తూ ఈ సహాయాన్ని అందించినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమానికి గన్నవరం గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య నాగేశ్వరరావు, ఎంఈ ఎఫ్ ఇన్‌చార్జ్ దేవరపల్లి ఏసుబాబు, మరియు నిడమర్తి నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు, గ్రామ పెద్దలు కలపాల బుల్లయ్య, తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాళ్లు అన్నే జ్యోతి మరియు మల్లేశ్వరి తదితరులు హాజరయ్యారు. విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.పారా రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని, ఈ దిశగా తన వంతు కృషిని కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పి.ఆర్.కె. ఫౌండేషన్‌కు మరియు పారా రామకృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# చిన్నారిని ఆశీర్వదించిన పరకాల పట్టణం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోద



పరకాల నియోజకవర్గంలో (శుభోదయం న్యూస్): ఈరోజు పరకాల పట్టణానికి చెందిన గొడుగు నాగరాజ్ భార్గవి గార్ల కూతురు చి, లాస్యకు నూతన వస్త్ర పుష్పాలంకరణ మహోత్సవ కార్యక్రమం పరకాల పట్టణంలోని ఎఫ్ జె ఫంక్షన్ హాల్ లో జరగగా ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారి లాస్య ను ఆశీర్వదించిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ సమన్వయ కమిటీ సభ్యులు బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, బండి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# సాంబాపూర్

## గ్రామ మున్నూరుకాపు అధ్యక్షుడిగా - మేకల రవి



బీర్పూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): సాంబాపూర్ గ్రామ మున్నూరుకాపు అధ్యక్షుడిగా మేకల రవి ఉపాధ్యక్షులు మేకల భూమయ్య , ప్రధాన కార్యదర్శి చామంతి హను మండ్లు, కార్యదర్శి బరిసెట్టి సుదర్శన్, కోశాధికారిగా బండారి భూమయ్య, సలహాదారులుగా చామంతి పోశెట్టి, మేకల శ్రీనివాస్ ,మేకల సురేష్, బర్సెట్టి నందకుమార్, మేకల సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశమై ప్రతి సభ్యుడు సంఘ అభివృద్ధికి తొడ్పడాలని అందరు కలిసిమెలిసి ఐక్యంగా ఉండాలని కోరడమైనది ఈ సమావేశంలో బీర్పూర్ మండల మున్నూరుకాపు అధ్యక్షులు.. ముఖ్యఅతిథిగామేకల విట్టల్ పటేల్ గారు మరియు ఎంగాయి సత్యం పటేల్ గారు , మండల ప్రధానకార్యదర్శి రెంజర్ల అనిల్ పటేల్ పాల్గొని అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు కుల పెద్దలకు శాలువలతో సత్కరించి, విజయవంతం చేయడం జరిగింది.

# పాలకుర్తి మండలం లో ఈసాల తక్కలపల్లి గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట

## ముఖ్య అతిథులుగా రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మరియు వారి సతీమణి మనాలి ఠాకూర్



రామగుండం మండలం, రిపోర్టర్ -తిరుపతి, (శుభోదయం న్యూస్): పాలకుర్తి మండలంలోని ఆదివారం రోజున ఈసాలతకళ్లపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రామగుండం శాసనసభ్యులు శ్రీ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మరియు వారి సతీమణి, మక్కన్ సింగ్ సేవా సమితి చైర్మన్ శ్రీమతి మనాలి ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని వారు ఆలయ ప్రాంగణంలో ప్రతిష్టించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశానికి అందించిన సేవలు అపూర్వమైనవి. సామాజిక సమానత్వానికి అడ్డుకట్ట వేసిన వ్యవస్థలపై ఆయన పోరాటం ప్రతి భారతీయుడికి ప్రేరణగా నిలుస్తుంది. ఆయన ఆశయాలను నేటి తరం నెరవేర్చే దిశగా ముందుకు సాగాలి, అని పేర్కొన్నారు. అలాగే శ్రీమతి మనాలి ఠాకూర్ మాట్లాడుతూ అంబేద్కర్ గారి విలువలు,



చరిత్ర గురించి గ్రామీణ స్థాయిలో పిల్లలకి మరియు యువతకి తెలియజేయడం మన బాధ్యత. ఈ విగ్రహం కొత్త తరం యువతకి మార్గదర్శిగా నిలవాలి, అని తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై, తమ ప్రేమాభిమానాలను వ్యక్తం చేశారు. అంబేద్కర్ యువజన సంఘం, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈసాలతకళ్లపల్లి గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ హామీ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం గ్రామ ప్రజలతో వారిద్దరూ భేటీ అయి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## ఆరువేల మార్క్‌ను దాటిన కొవిడ్ కేసులు



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కొవిడ్ వేగంగా విజృంభిస్తోంది. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 6,000 మార్క్‌ను దాటినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం ప్రకటించింది. కొత్తగా 6,133 కేసులు నమోదు కాగా, గడిచిన 24 గంటల్లో ఆరు మరణాలు నమోదయ్యాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. 48గంటల్లో 769 కొత్త కేసులు నమోదవగా, కేరళ మొదటి స్థానంలో ఉందని తెలిపింది. గుజరాత్, పశ్చిమబెంగాల్, ఢిల్లీ తరువాతి స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది జనవరి నుండి దేశంలో 65 మరణాలు నమోదుకాగా, మే 22 నాటికి దేశంలో మొత్తం 257 యాక్టివ్ కేసులు ఉన్నాయి. పెరుగుతున్న కేసుల దృష్ట్యా కేంద్రం దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్స్‌ను నిర్వహిస్తోందని అధికారిక వర్గాలు తెలిపాయి. ఆక్సిజన్, ఐసోలేషన్ బెడ్‌లు, వెంటిలేటర్లు మరియు అవసరమైన మెడిసెన్స్‌ను అందుబాటులో ఉండేలా చూడాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

## గాజాలో యుద్ధాన్ని ముగించాలంటూ రోమ్‌లో భారీ ప్రదర్శన



రోమ్ : గాజాలో యుద్ధాన్ని వెంటనే ముగించాలని డిమాండ్ చేస్తూ శనివారం సుమారు 30,000మంది ప్రదర్శనకారులు రోమ్ వీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. ఇటలీ ప్రధాన ప్రతిపక్షమైన వామపక్షంతో పాటు పలు పార్టీల పిలుపుమేరకు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి వచ్చిన నిరసనకారులు ర్యాలీలో పాల్గన్నారు. వీరిలో చిన్న పిల్లలతో ఉన్న కుటుంబాలు కూడా ఉన్నాయి. మితవాద ప్రభుత్వం మౌనంగా ఉందని, గాజాలో మారణకాండపై ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. పాలస్తీనా, ప్రతిపక్ష పార్టీల జెండాలను చేతబూని "ఊచకోతను ఆపండి, కుట్రను ఆపండి" అనే ప్లకార్డులను నిరసనకారులు ప్రదర్శించారు. పాలస్తీనియన్ల ఊచకోతకు, ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహూ నేరాలను ఎండగట్టేందుకు ఇది ఒక అపారమైన ప్రజా ప్రతిస్పందన అని ఇటలీ సెంటర్ లెఫ్ట్ డెమోక్రటిక్ పార్టీ నేత ఎల్లీష్లీన్ పేర్కొన్నారు. మెలోనీ ప్రభుత్వ విధానం మాదిరిగా కాకుండా మౌనంగా ఉండని మరొక ఇటలీ ఉందని ఇటలీ ప్రధాని జార్జి మెలోనీని ఎండగడుతూ ఆమె పేర్కొన్నారు. అసాధారణమైన ఊచకోత జరిగినప్పటికీ, క్రూరమైన, అనుచితమైన ప్రతిచర్య జరిగినప్పటికీ ఇటాలియన్ ప్రభుత్వం స్పందించడం లేదని ట్యునీషియా ప్రదర్శనకారుడు ఒకరు అన్నారు.

## రాహుల్ గాంధీని ప్రజలు తిరస్కరించారు, అందుకే ఆయనకు కోపం..



న్యూఢిల్లీ : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగినట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఆదివారం తీవ్ర విమర్శలు చేశారు. "రాహుల్ గాంధీని ప్రజలు తిరస్కరించినప్పటికి నుంచి ఆయన ప్రజాస్వామ్య ప్రక్రియను పదే పదే అవమానిస్తున్నారు" అని ఆరోపించారు. "రాహుల్ గాంధీ నిరంతరం ప్రజాస్వామ్య ప్రక్రియను అవమానిస్తున్నారు. ఆయన ప్రజాతీర్పును పదే పదే అగౌరపరుస్తున్నారు. ప్రజలు రాహుల్ గాంధీని తిరస్కరించారు. ప్రతీకారంగా ఆయన ప్రజల్ని తిరస్కరిస్తున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీని మరింత క్షీణతలోకి నెట్టివేస్తుంది" అని ఫడ్నవీస్ అన్నారు. దీనికి ముందు, శనివారం రోజు రాహుల్ గాంధీ ఒక వార్తా పత్రిక కథనంలో.. 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు "ప్రజాస్వామ్యాన్ని మోసగించడానికి ఒక ప్రణాళిక" అని పేర్కొన్నారు. మహారాష్ట్రలో "మ్యాక్ ఫిక్సింగ్" జరిగినట్లు బీహార్ లో కూడా చేస్తారని ఆయన ఆరోపించారు. అయితే, రాహుల్ గాంధీ వాదనల్ని 'పూర్తిగా అసంబద్ధం" అని కేంద్రం ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. దీనికి కౌంటర్‌గా సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఆదివారం వార్తా కథనంలో రాహుల్ గాంధీ తీరును ప్రశ్నించారు. "ప్రజాస్వామ్య ప్రక్రియ, రాజ్యాంగ సంస్థలపై నిరంతరం సందేహాలు వ్యక్తం చేయడం ద్వారా, దేశాన్ని ఎటు వైపు తీసుకెళ్తున్నారు..? ఎలాంటి విషాన్ని వ్యాపింపచేస్తున్నారు..?" అని అడిగారు. "మహారాష్ట్రలో ఓటమి ఎంత తీవ్రంగా బాధించిందో నాకు అర్థమైంది. కానీ మీరు రైతులు, మహిళలు, పౌరులు,మహారాష్ట్ర ప్రజల అభిప్రాయాన్ని ఇలా అవమానించడం కొనసాగిస్తే, రాష్ట్ర ప్రజలు మిమ్మల్ని ఎప్పటికీ క్షమించరు. ముఖ్యమంత్రిగా, ప్రజా సేవకుడిగా, మహారాష్ట్ర ప్రజలకు జరిగిన ఇటువంటి అవమానాన్ని నేను ఎల్లప్పుడూ ఖండిస్తాను" అని ఫడ్నవిస్ అన్నారు. గతేడాది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి 288 సీట్లకు గానూ 235 సీట్లను గెలుకుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)లోని కాంగ్రెస్-16, శివసేన (ఠాక్రే)-20, శరద్ పవార్ ఎన్సీపీ-10 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఆరు దశాబ్దాలలో తొలిసారిగా ప్రతిపక్ష నాయకుడి హోదా పొందలేకపోయారు.

## అమరావతి ప్రజలకు జగన్, భారతీ రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందే..!



**అమరావతి,:** అమరావతిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. ఇటీవల వైస్సార్సీపీ నాయకుల మాటలు రాష్ట్ర గౌరవాన్ని భంగపరచేలా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. అమరావతిని కించపరిచేలా పదాలను ఉపయోగించడంపై తీవ్ర అభ్యంతరకరం చేసారు. అమరావతి అంటేనే జగన్మోహన్ రెడ్డికి అక్కసు.. మూడు రాజధానులు పేరుతో విషం కక్కారని హోం మంత్రి వ్యాఖ్యానించారు. వైసీపీ పాలన మొదటి నుంచీ అమరావతిని నిర్లక్ష్యం చేయడమే లక్ష్యంగా తీసుకున్నట్లు ఆమె ఆరోపించారు. అమరావతి సాధన పోరాటంలో 270 మంది చనిపోయారు. ఇప్పుడు పునర్నిర్మాణ పనులు వేగంగా సాగుతుంటే ఎందుకు ఓర్వలేకపోతున్నారు? అని ఆమె ప్రశ్నించారు. అమరావతిని వేశ్యల రాజధాని అని అభద్రంగా చెప్పే వారిని ప్రోత్సహించిన వారెవరో బయట పెట్టాలని ఆమె స్పష్టం చేశారు. ఇక చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన మీటింగ్‌లో ప్రభుత్వాన్ని వ్యతిరేకించేలా మాట్లాడారని, కానీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడమంటే మహిళలను కించపరచడమా? అని అనిత ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ పేరు దెబ్బతీయడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు అర్థం చేసుకోవాలని ఆమె అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో జగన్ మోహన్ రెడ్డి, ఆయన భార్య భారతీ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యల వెనుక కుట్రదారులపై చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటాం. వారి పత్రిక, ఛానల్‌పై ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఇక కృష్ణం రాజు కుమార్తెపై టీడీపీ సోషల్ మీడియాలో చేసిన పోస్టులపై స్పందిస్తూ, ఆ వ్యాఖ్యలు కూడా తప్పేనని చెప్పాను. ఆ పోస్టులను తొలగించమని సూచించానని అనిత చెప్పారు. ఒక వ్యక్తి చేసిన మూర?పు వ్యాఖ్యలను ఖండించాలి. కానీ అమరావతి రైతులు, మహిళల మధ్యకి వెళ్లి నిజంగా చెప్పగల ధైర్యం ఎవరికి ఉందో చూడాలి అంటూ విమర్శల దాడి చేశారు.

# బడికి బాట పడుతుందా!




దశాబ్దాలుగా బడికి బాటలు వేయాలని హోరెత్తే నినాదాలతో, కార్యక్రమాలతో, ప్రచారాలతో ముందుకుపోతున్నా, ప్రభుత్వ బడులు కళకళలాడడంలేదనేది చేదైన విషయం. దీని ఫలితం సమాజంపైనా, భవితపైనా తీవ్రంగానే పడుతోంది. ప్రభుత్వ బడులు కళకళలాడడం అటుంచి, మూతపడి కనుమరుగవటం పెద్ద విషాదం. పెరుగుతున్న జనాభా ప్రకారం పెరగాల్సిన బడులు, ప్రభుత్వంలో మాత్రం తగ్గుతుంటే%ా% ప్రయివేటు వ్యాపార పాఠశాలలు మాత్రం రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల మానసిక ఆలోచనల్లో ప్రవర్తనల్లోనే పెద్ద మార్పు వచ్చింది. మానవ సంబంధాలపై కూడా తీవ్ర ప్రభావాన్ని కలుగచేసింది. కొనడం, అమ్మడం విలువల ఆధారంగానే మనుషుల మధ్య సంబంధాలు ఏర్పడుతున్నాయి. ఇది మనకు కనపడకుండా జరిగే మార్పు. ఇక బాధ్యత వహించాల్సిన ప్రభుత్వాలూ చేతులెత్తేయటం, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దటంలో సమాజానికి బాధ్యత లేకపోవడం మూలాన అనేక అనర్థాలు పరిణమిస్తున్నాయి. ఇది లోతుగా ఆలోచించినపుడే బోదపడుతుంది. ఇప్పుడవేవీ ఆలోచించే స్థితిలో ప్రభుత్వాలు లేవు. అయితే ప్రజలు, పౌరసమాజమూ అంతే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మరింత అనర్థం ఎదురవుతుంది. మానవ వనరులను మానవీయ మార్గంలో నైపుణ్యవంతంగా తీర్చడం, విలువల ప్రాతిపదికన అభివృద్ధి పరచడం అనేది ప్రభుత్వ ఆధీనంలోనే జరగాలి. జరుగుతుంది కూడా. కానీ ప్రభుత్వ ప్రాధాన్యతలు కూడా మారిపోయాయి. ప్రయివేటుకు ఊడిగం చేసే వ్యవస్థగా అదీ మారిపోయింది. అందుకనే కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు విద్యావ్యాపారానికి అనుకూల నిర్ణయాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వమూ ప్రయివేటునే పెంచి పోషిస్తున్నది. విచ్చలవిడిగా ప్రయివేటు పాఠశాలలకు అనుమతులిస్తున్నారు. పాఠశాల నిర్వహణా ప్రమాణాలేవీ పట్టించుకోకుండానే ప్రయివేటు బళ్లు నడుస్తున్నాయి. కేవలం ఫలితాలు ఆధారంగానే బేరీజు వేస్తున్నారు. అయితే ఇందులో ప్రభుత్వ బడుల వైఫల్యమూ వుంది. దీనికి సవాలక్ష కారణాలున్నాయి. 'దేశభవిష్యత్తు తరగతి గదిలో రూపుదిద్దుకుంటుంద'ని కొఠారి కమీషన్ చెప్పిన విషయాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి కనీసంగా పదిశాతం నిధులు కేటాయించాలన్నదీ పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వాలూ విద్యపట్ల అంతే నిర్లక్ష్యంగా ఉన్నాయి. మారుతున్న అవసరాలకనుగుణంగా విద్యా వ్యవస్థను మలచుకోవడంలో విఫలమవుతున్నాయి. ప్రభుత్వ బడులకు సౌకర్యాలు, వసతులు కల్పించడంలోనూ పెద్ద లోపాలున్నాయి. ఆడపిల్లలకు అన్ని పాఠశాలల్లో మూత్రశాలలు లేవు. తరగతికొక గదిని, గదికొక ఉపాధ్యాయున్ని, పర్యవేక్షకులను ఏర్పాటు చేసుకోలేకపోయాము. ఆవాసాలకు అందుబాటులో పాఠశాలల్ని నిర్మించడం అటుంచి, విద్యార్థులు తక్కువగా ఉన్నారనే నెపంతో ఉన్నవాటినే మూసేస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు, ప్రభుత్వ బడులకు మధ్య అగాధం పెరుగుతోంది. విద్యార్థికి పాఠశాలను దూరంగా నెడుతున్నారు. విద్యా విలువను గ్రహించిన సామాన్య ప్రజలు కూడా ప్రభుత్వ పాఠశాలలో, ప్రభుత్వ వైద్యశాలలో నాణ్యత ఉండదనే అభిప్రాయంలోకి వచ్చారు. పేదరికంలో ఉన్న ప్రజలు కూడా తమ జీవితాలనూ తాకట్టు పెట్టి మరీ ప్రయివేటువైపు మొగ్గు చూపుతున్నారు. రంగురంగుల భ్రమలు, ఆంగ్ల మోజు ఆకర్షణకు గురిచేస్తున్నది. పేదలను ఫీజుల భారం మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఇప్పటికి కూడా గ్రామీణ ప్రాంతంలో పేద సామాన్య ప్రజలు ప్రభుత్వ బడులనే ఆశ్రయిస్తున్నారు. 26,106 ప్రభుత్వ పాఠశాలలలో దాదాపు 17 లక్షల మంది విద్యార్థులు నమోదై ఉన్నారని తెలుస్తున్నది. అసలు విద్యార్థాలే చేరని పాఠశాలలూ వందల సంఖ్యలో ఉన్నాయని, వాటిని మూసివేసే ప్రమాదముందని తెలుస్తున్నది. బడులను మెరుగుపరచాలి. నాణ్యమైన విద్య దొరుకుతుం దనే విశ్వాసాన్ని తల్లిదండ్రులలో కలుగచేయాలి. ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రజలపైన కూడా ఉంది. అంతేకాదు ప్రభుత్వ విద్యా వ్యవస్థలో కీలక భాగస్వా ములుగా ఉన్న ఉపాధ్యాయులపై మరింత ఎక్కువ బాధ్యత ఉంది. ప్రొ జయశంకర్ గారి పేరు మీద నడుపుతున్న బడిబాట కార్యక్రమం కేవలం కార్యక్రమంగా కాకుండా బడి బయట ఉన్న పిల్లలను, డ్రాపౌట్స్‌ను, ప్రభుత్వ బడిలోకి చేర్పించే పనిని ప్రభుత్వం, అధికారులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, ప్రజలు ఉమ్మడిగా నిబద్ధతతో చేపట్టాలి. ప్రాథమిక పాఠశాలలలో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలి. ఆకర్షణీయ బోధనా పద్ధతులతో ఆధునిక విధానాలతో తరగతుల నిర్వహణలో బడులు సాగినపుడు ప్రభుత్వ బడులు కళకళలాడుతాయి. ప్రభుత్వాలూ చిత్తశుద్ధితో కృషి చేసినపుడే బడిబాట లక్ష్యం నెరవేరుతుంది.

# తేలని చర్చలు.. తీరని ఉద్రిక్తతలు



ఉక్రెయిన్ రష్యా మధ్య శాంతి చర్చలకు ఒకవంక ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవంక పరస్పరం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. టర్కీ మధ్యవర్తిత్వంలో రెండోసారి రెండు దేశాల ప్రతినిధుల మధ్య శాంతి చర్చలు జరిగినా గంటలోనే ఎటూ తేలకుండా ముగిసిపోయాయి. కాల్పుల విరమణ ప్రసక్తి లేకుండా యుద్ధఖైదీల మార్పిడిపై మాత్రం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ చర్చలకు 24 గంటల ముందు రష్యాపై ఉక్రెయిన్ ప్రయోగించిన వందలాది డ్రోన్లు ఆదివారం రష్యా సైనిక స్థావరాలు అయిదింటిలో భారీ విధ్వంసం సృష్టించాయి. అంతకు ముందు రష్యా రెండుసార్లు ఉక్రెయిన్‌పై బాంబుల వర్షం కురిపించింది. రానురాను ఈ పరస్పర దాడుల పరిణామాలు ఎంతవరకు సాగుతాయో చెప్పలేం. రోజురోజుకూ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి మొదటినుంచి అండదండలుగా నిలుస్తున్న ఐరోపా దేశాలు రష్యా దూకుడుపై ఆగ్రహంతో ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎంత నచ్చచెప్పినా రష్యా అధ్యక్షుడు పుతిన్ దురాక్రమణలను, దాడులను ఆపడంలేదని వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు భారీ సంఖ్యలో డ్రోన్‌లను సరఫరా చేయడానికి బ్రిటన్ సిద్ధమవుతోంది. 2026 ఏప్రిల్ నాటికి ఉక్రెయిన్‌కు లక్ష డ్రోన్లు అందజేస్తామని బ్రిటన్ హామీ ఇచ్చింది. ఆ దేశానికి ఇచ్చే 4.5 బిలియన్ పౌండ్ల మిలిటరీ మద్దతులో ఈ 350 మిలియన్ పౌండ్ల డ్రోన్ ప్యాకేజీ భాగమని పేర్కొంది. ఉక్రెయిన్ డ్రోన్లు రష్యాలోని 41 బాంబర్ విమానాలను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. 2022 డిసెంబర్‌లో రష్యా భూభాగంలో ఉక్రెయిన్ తొలిసారి దాడులు మొదలు పెట్టింది. గత మూడేళ్లుగా డ్రోన్ల వినియోగంలో తన సామర్థ్యాన్ని ఉక్రెయిన్ మెరుగుపర్చుకుంది. ఉక్రెయిన్ డ్రోన్ల దాడి జరుగుతుందని, అపార నష్టం సంభవిస్తుందని రష్యా ఊహించలేదు. ఈ దాడుల్లో రష్యా టియు 95, టియు 120 విమానాలు విధ్వంసం అయ్యాయి. వీటిని రష్యా తిరిగి సమకూర్చుకోవాలంటే వేలాది కోట్ల రూబుళ్లు ఖర్చు పెట్టవలసి వస్తుందని నిపుణులు అంచనాగా చెబుతున్నారు. రష్యా దాడులవల్ల గత మూడేళ్లలో ఉక్రెయిన్ వేలాది మంది సైన్యాన్ని కోల్పోయినప్పటికీ పాశ్చాత్య దేశాల మద్దతుతో ఉక్రెయిన్ నిలబడగలుగుతోంది. నల్లసముద్రంలో రష్యా రణతంత్ర వ్యూహాలను ఛేదించడానికి డ్రోన్‌ల వినియోగంపైనే ఉక్రెయిన్ ఆధారపడుతోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ దృష్టిలో జెలెన్‌స్కీ పిపీలికం. ఎలాగైనా జెలెన్‌స్కీని పాదాక్రాంతం చేసుకోవాలన్న కక్ష పుతిన్‌లో పోవడం లేదు. అందుకే కాల్పుల విరమణకు జెలెన్‌స్కీ అంగీకరించినా పుతిన్ ఒప్పుకోవడం లేదు. కాల్పులు విరమణ కావాలంటే అనేక షరతులను పుతిన్‌ముందుకు తీసుకు వస్తున్నారు. ఉక్రెయిన్‌లో తాము ఆక్రమించుకున్న భూభాగాలను విడిచిపెట్టాలని, నాటో కూటమిలో ఉక్రెయిన్ సభ్యత్వం పొందరాదని, భవిష్యత్తులో యుద్ధానికి సిద్ధపడబోమని లిఖితపూర్వక హామీ ఇవ్వాలని పుతిన్ ఆంక్షలు విధిస్తున్నారు. అసలు ప్రత్యక్షంగా తమతో చర్చలకు జెలెన్‌స్కీ సరిపోడని పుతిన్ అభిప్రాయం. రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమై 40 నెలలు గడుస్తోంది. రెండు దేశాల మధ్య విసుగు, అలసట ఛాయలు కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధ భూమిలో అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. రష్యాతో పోలిస్తే ఉక్రెయిన్‌కు ఆయుధాల కొరత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థ లేకపోవడంతో రష్యా క్షిపణులు, డ్రోన్ల దాడులను తట్టుకోలేకపోతోంది. అందుకనే వినూత్నమైన డ్రోన్ దాడులను నిర్వహించడం ద్వారా తన దుర్బలత్వాలను భర్తీ చేయడానికి ప్రయత్నిస్తోంది. ఉక్రెయిన్ తన ఖేర్సన్ సిటీని కోల్పోయిన తరువాత తాను కోల్పోయిన భూభాగాల్లో 2022 నుంచి ఎలాంటి విజయాలను సాధించలేదు. గత ఏడాదిగా 5000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ఉక్రెయిన్ రష్యా వల్ల కోల్పోయింది. ఉక్రెయిన్ ముట్టడించిన కుర్స్‌ను రష్యా తిరిగి స్వాధీనం చేసుకోగలిగింది. రష్యా స్ప్రింగ్ (వసంత) దాడి ఇప్పుడు ఊపందుకోంది. సుమీ రీజియన్‌లో భూభాగాలను ఆక్రమించుకుంటోంది. ఉక్రెయిన్ వారాంతపు రష్యా వైమానిక దాడులతో చుట్టుకుపోతోంది. దీనికితోడు సైనిక బలగాల తీవ్ర కొరత, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో మద్దతు కొనసాగడంలో అనిశ్చితి ఇవన్నీ ఉక్రెయిన్‌కు తీరని ప్రతిబంధకాలుగా వెంటాడుతున్నాయి. మరోవంక రష్యాకు కూడా తమ ఇంధన వనరులపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులను నివారించడం కష్టంగా కనిపిస్తోంది. అలాగే నల్లసముద్రంలోని రష్యా దళాలపై ఉక్రెయిన్ దాడులు కొనసాగుతున్నాయి. ఇప్పుడు వైమానిక స్థావరాలపై ఉక్రెయిన్ దాడులు చేయడం రష్యాకు కలవరం కలిగిస్తోంది. రష్యా యుద్ధ రంగంలో ఏమాత్రం దూకుడు పెంచినా ఉక్రెయిన్‌నుంచి ఎదురుదాడి తప్పదు. ఇదే విధంగా యుద్ధం కొనసాగితే రెండు వైపులా అపార నష్టం తప్పదు. ట్రంప్ చొరవతో ప్రారంభమైన శాంతి చర్చలు కొద్దిపాటి పురోగతిని అందించాయి. ఈ సమయంలో ట్రంప్ తప్పుకోకూడదు. రష్యాకు చాలా కాలంగా ఫిర్యాదులు ఉన్నాయి. భవిష్యత్తు భద్రతా సమస్యలున్నాయి. ఇవన్నీ పరిష్కరించవలసి ఉంది. అయితే భవిష్యత్తులో తమపై దాడులు జరగకుండా ఉండేందుకు విశ్వసనీయమైన భద్రతా గ్యారంటీలను రష్యా నుంచి ఉక్రెయిన్ ఆకాంక్షిస్తోంది. ఈ విభేదాలను పరిష్కరించడంలోను, కాల్పుల విరమణ ఒప్పందం ఉభయ దేశాల మధ్య కుదర్చడం లోనూ కీలక సూత్రధారి అమెరికా ప్రభుత్వమే. ఇస్తాంబుల్‌లో రెండు దేశాల మధ్య రెండో విడత చర్చలు విఫలమైన నేపథ్యంలో కనీసం ఈ నెలాఖరులోగా రెండు దేశాల అధ్యక్షులు ప్రత్యక్షంగా చర్చలు జరిపితేనే పరిష్కారం లభిస్తుందని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ చేసిన ప్రతిపాదన సమంజసమే అనిపిస్తోంది.

# నిజాలు దాచిపెట్టి.. జిడిపి కనికట్టు




దేశంలో జిఎస్‌టి (గూడ్స్ అండ్ సర్వీస్ పన్ను) వసూళ్లు బాగా పెరిగాయి. మే నెలలో జిఎస్‌టి వసూళ్లు రూ. 2 లక్షల కోట్లను దాటింది. ఏప్రిల్‌లో జరిగిన లావాదేవీల వల్ల మే నెలలో దాని ఫలితాలు కనిపించాయి. ఆర్థిక అస్థిరత నెలకొన్న పరిస్థితుల్లో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలు అల్లకల్లోలమై ప్రపంచ వాణిజ్యం గందరగోళంలో పడిన తరుణంలో ఈ విధంగా జిఎస్‌టి వసూళ్లు అమాంతంగా పెరగడం ఆశ్చర్యమే. వాణిజ్యం పుంజుకుని దిగుమతుల నుంచి 25 శాతం ఆదాయం పెరిగింది. జిఎస్‌టి రెండింతలు పెరగడం బలమైన ఆర్థిక కార్యకలాపాలకు, పన్నుల వసూలు వ్యవస్థలో పరిపక్వతకు సంకేతాలుగా ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. 2025లో భారత్ 7.4 శాతం జిఎస్‌టితో ప్రపంచ నాలుగో ఆర్థిక వ్యవస్థగా రూపొందడానికి జపాన్‌ను అధిగమిస్తుందని ఇటీవల అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) బాహాటంగా ప్రకటించింది. ఇవి గుర్తింపదగిన మైలురాళు ‌గా చెప్పుకున్నప్పటికీ సంపూర్ణ స్థూలదేశీయోత్పత్తి (జిడిపి) ఆధారంగా మాత్రమే పోలికలు ఉంటాయి. కానీ ప్రస్తుత జీవన వాస్తవాలపై జిడిపి పరిమిత అంతర్ దృష్టిని అందిస్తుంది. ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి సంపూర్ణ జిడిపి గణాంకాలు మాత్రమే ఉపయోగపడతాయి. కానీ సంపద పంపిణీ ఎలా చేయబడుతుందో, దేశం ఎలా అభివృద్ధి చెందిందో, ప్రజలు ఎలా విలవిల్లాడుతున్నారో, తదితర వాస్తవాలను పట్టుకోలేకపోతున్నాయి. జనాభా పరిమాణం, జీవన వ్యయం, ఆదాయ అసమానతలను కప్పిపుచ్చుతున్నాయి. ఒక దేశం మొత్తం మీద పెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగి ఉండవచ్చు. కానీ అది తప్పనిసరిగా సంపదకు అనుగుణంగా ఉండదు. అలాగే అభివృద్ధి చెందిన జీవన ప్రమాణాలను ప్రతిబింబించదు. ఉదాహరణకు భారత్ సంపూర్ణ జిడిపి (బిలియన్ డాలర్లలో) 2000 సంవత్సరంలో 468.4 బిలియన్ డాలర్ల నుంచి 2025 లో 4,187 బిలియన్ డాలర్లకు పెరిగినట్టు అంచనా వేయబడింది. ఈ ప్రక్రియలో జపాన్ గణాంకాలను తృటిలో అధిగమించడమవుతోంది. కానీ వాస్తవాలను విశ్లేషిస్తే భారతదేశ తలసరి స్థూల దేశీయోత్పత్తి (జిడిపి పెర్ కేపిటా) అంటే ఒక సంవత్సరంలో ఒక వ్యక్తికి లభించే సగటు ఆదాయం 2025లో జపాన్ తలసరి ఆదాయం కన్నా 12 రెట్లు తక్కువగానే ఉంది. ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పడానికి పోలెండ్‌ను మనం పోల్చిచూద్దాం. దిగువ మధ్యాదాయం నుంచి అధిక ఆదాయ ఆర్థికానికి తరచుగా త్వరితంగా పరివర్తన చెందే దేశంగా ప్రస్తావించబడుతోంది. పోలెండ్ మొత్తం జిడిపి చూస్తే భారత జిడిపి కన్నా నాలుగు రెట్లు చిన్నది. కానీ పరిశీలిస్తే ఆ దేశం తలసరి జిడిపి తొమ్మిది రెట్లు ఎక్కువ. ఆర్థిక వృద్ధి అన్నది దేశ పురోగతికి ముఖ్యమైన సూచిక. అదే విధంగా సామాజిక, విద్య, ఆరోగ్య రంగాలతోపాటు ప్రజాస్వామ్య సూచికలు సాధించిన పురోగతిని అంచనా వేయడం కూడా అంతే ముఖ్యం.ఇవన్నీ వాస్తవ పురోగతిని లెక్కకట్టడానికి అర్థవంతమైన ప్రమాణాలు. రెండు దశాబ్దాల నాటి డేటా ఆధారంగా భారత్, పోలెండ్, జపాన్ దేశాల పురోగతిని పరిశీలిస్తే మొట్టమొదట ఉద్యోగాల స్వభావాన్ని లెక్కలోకి తీసుకోవాలి. 2023 వరకు భారత దేశ శ్రామికశక్తి 45% ఇంకా వ్యవసాయంపైనే ఆధారపడి ఉంటోంది. దీనికి విరుద్ధంగా పోలెండ్, జపాన్ దేశాల్లో ఈ పరిస్థితి 10 శాతం కన్నా తక్కువగా ఉంది. ఆయా దేశాల్లో పారిశ్రామిక, సేవా రంగాల్లో ఉద్యోగాలు 10 శాతం మించి పెరిగాయి. ఇక సాధారణ ఉపాధిలో వేతనాలు, జీతాలు పొందే కార్మికుల వాటాను పరిశీలిస్తే ఎవరైతే అధికారిక ఒప్పందాల్లో ఉన్నారో వారు భారత్‌లో 2023లో కేవలం 23.9% మాత్రమే ఉండగా, జపాన్‌లో 91%, పోలెండ్‌లో 80.1% ఉన్నారు. కాలేజీ స్థాయి చదువుల్లో 2022లో భారత్‌లో 32.7% మాత్రమే నమోదు ఉండగా, జపాన్‌లో 65%, పోలెండ్‌లో 75% ఉంది. ఆరోగ్యం విషయంలో భారత్‌లో వ్యక్తి సరాసరి గరిష్ఠ ఆయుర్దాయం 72 ఏళ్లు కాగా, జపాన్‌లో 84 ఏళ్లు, పోలెండ్‌లో 78.5 ఏళ్లుగా ఉంది. ఆరోగ్య సంరక్షణ ఎంతవరకు ప్రాప్తిస్తుందో అన్నది ఆ దేశంలోని శిశు మరణాల రేటును ప్రతిబింబిస్తుంది. ఏడాది లోపు వయసున్న శిశు వుల్లో వెయ్యి జననాల్లో ఎన్ని మరణాలు ఉన్నాయో దానిని బట్టి ఆరోగ్య సంరక్షణను పరిగణించవచ్చు ఆయా దేశాల్లో శిశు మరణాల రేటు 2000 నుంచి 2023 మధ్య కాలంలో సగానికి సగం తగ్గగా, భారత్‌లో ఈ రేటు 24.5 శాతం వరకు ఉంది. జపాన్, పోలెండ్ దేశాల్లో వెయ్యి జననాల్లో ఐదు కన్నా తక్కువ మరణాల రేటు ఉంది. ఇవన్నీ కలిపి మానవ అభివృద్ధి సూచికను ఆయా దేశాల్లో సూచిస్తాయి. ఆరోగ్యం, విద్య రంగాలు, జీవన వ్యయం ఈ విధంగా మొత్తం సాధించిన లక్షాలను మానవ అభివృద్ధి సూచిక కింద పరిగణిస్తారు. ఇది 0 నుంచి 1 మధ్యలో లెక్కిస్తారు. 1 అన్నది ఎక్కువ మానవాభివృద్ధి కింద వస్తుంది. భారత్ హెచ్‌డిఐ (మానవాభివృద్ధి సూచిక) 2023 లో 0.635 గా చాలా కనీసంగా పరిగణింపబడగా, జపాన్, పోలెండ్‌ల్లో 0.9 మార్కును దాటింది. ఇది ఎక్కువ మానవాభివృద్ధికి సంకేతం. భారత తలసరి ఆదాయం ప్రస్తుత ధరల వద్ద రూ. 1,72,000 కు చేరినట్టు జాతీయ గణాంక కార్యాలయం వెల్లడించింది. ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చాక దాదాపు 99 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణన లోకి తీసుకుంటే ప్రస్తుత ధరల వద్ద తలసరి ఆదాయంలో వచ్చిన వృద్ధి చాలా తక్కువని ప్రముఖ ఆర్థికవేత్తలు చెబుతున్నారు. తలసరి ఆదాయం దేశ ప్రజల ఆదాయాల సగటు అని, సగటు ఎప్పుడూ ఆర్థిక అసమానతలను ప్రతిబింబించదని పేర్కొన్నారు.

## ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే పాకిస్తాన్‌లో బహుమతి దక్కుతుంది..



**న్యూఢిల్లీ,:** పాకిస్తాన్ తీరును మరోసారి కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రంగా విమర్శించారు. "ఆపరేషన్ సిందూర్" గురించి విదేశాలకు వివరించే భారత దౌత్య బృందానికి థరూర్ నాయకత్వం వహిస్తున్నారు. ఈ బృందం అమెరికా డిప్యూటీ సెక్రటరీ ఆఫ్ స్టేట్ క్రిస్టోఫర్ లాండౌతో సమావేశమైంది. అల్-ఖైదా నాయకుడు ఒసామా బిన్ లాడెన్‌ను గుర్తించి, నిర్మూలించడానికి అమెరికాకు సహాయం చేసిన వైద్యుడు డాక్టర్ షకీల్ అఫ్రిది పట్ల పాకిస్తాన్ వ్యవహరించిన తీరును థరూర్ విమర్శించారు. యూఎస్ కాంగ్రెస్ సభ్యుడు బ్రాడ్ షెర్‌మెన్ సోషల్ మీడియాకు ప్రతిస్పందనంగా థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. డాక్టర్ అఫ్రిది విడుదల కోసం ఒత్తిడి తీసుకురావాలని అమెరికాలో ఉన్న పాకిస్తాన్ డెలిగేషన్‌ని షెర్‌మెన్ కోరారు. థరూర్ స్పందిస్తూ.. "పాకిస్తాన్ ఉగ్రవాద సూత్రధారి ఒసామా బిన్ లాడెన్‌కు (కంటోన్మెంట్ నగరంలోని ఆర్మీ క్యాంప్ సమీపంలోని సురక్షితమైన ఇంట్లో!) ఆశ్రయం కల్పించడమే కాకుండా, అమెరికన్లకు అతని స్థానాన్ని తెలిపిన ధైర్యవంతుడైన వైద్యుడిని అరెస్టు చేసి శిక్షించిన దేశం అని బ్రాడ్ షెర్‌మన్ గుర్తు చేశారు. పాకిస్తాన్‌లో మీరు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినందుకు ప్రతిఫలం పొందుతారు, ఉగ్రవాదులను బహిర్గతం చేసినందుకు హింసించబడతారు!" అని అన్నారు. డాక్టర్ షకీల్ అఫ్రిది అల్ ఖైదా నాయకుడు ఒసామా బిన్ లాడెన్‌ని అమెరికా వేటాడటంలో అమెరికాకు సహకరించారు. పాకిస్తాన్ ఖైబర్ ఫఖ్తుంఖ్వా ప్రావిన్సుకు చెందిన ఆరోగ్య అధికారి అయిన అఫ్రిదిని 2008లో పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే ఇస్లాం కమాండర్ మంగళ్ బాగ్ అపరిచాడు.

## మణిపూర్‌లో మరోసారి చెలరేగిన హింస.. ఆ జిల్లాలో కర్ఫ్యూ..



**న్యూఢిల్లీ,:** మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. శనివారం అనేక జిల్లాల్లో హింస చెలరేగింది. దీంతో బిష్ణుపూర్ జిల్లాలో కర్ఫ్యూ విధించారు. ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్‌ను నిషేధించారు. శనివారం రాత్రి మెయిటీ సంస్థ నాయకుడు అరంబై టెంగోల్, అనేక మంది ఇతర నాయకులను పోలీసులు అరెస్టు చేసిన తర్వాత హింస చెలరేగింది. నిరసనకారులు వీధుల్లోకి వచ్చి బస్సులు, వాహనాలకు నిప్పు పెట్టారు. ఆస్తులను ధ్వంసం చేశారు. ఆ తర్వాత హింసాత్మక ఘర్షణలు ప్రారంభమయ్యాయి. నిరసనకారులు తమపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని ప్రభుత్వాన్ని బెదిరించారు. దీనికి సంబంధించిన వీడియో కూడా బయటకు వచ్చింది. దీనిలో చాలా మంది నిరసనకారులు నిలబడి ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్నట్లు వీడియోలో ఉంది. అరంబాయి టెంగోల్ అరెస్టు తర్వాత.. శనివారం రాత్రి ఇంఫాల్ తూర్పు, పశ్చిమ జిల్లాల్లో కూడా భారీ నిరసనలు చెలరేగాయి. రాజధాని ఇంఫాల్‌లోని అనేక ప్రాంతాల్లో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. ఇంఫాల్‌లోని ఖురాయ్ లామ్‌లాంగ్ ప్రాంతంలో, కోపంతో ఉన్న నిరసనకారులు బస్సులను తగలబెట్టారు. టైర్లు తగలబెట్టి రోడ్లను దిగ్బంధించారు. భద్రతా దళాలతో ఘర్షణకు దిగారు. నిరసనకారులు ఇక్కడితో ఆగలేదు. ఇంఫాల్ విమానాశ్రయంలోని తులిహాల్ గేటు వెలుపల గుమిగూడారు. ఆందోళనకారులు రాత్రిపూట విమానాశ్రయ రోడ్డులో ట్రాఫిక్‌ను అడ్డుకుని, రాత్రంతా అక్కడే నిద్రపోయారు.రాజధానిలో పెరుగుతున్న హింసను చూసి పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించారు. లాఠీ ఛార్జ్‌లో ఓ వ్యక్తి మరణించినట్లు సమాచారం.

### తొక్కిసలాట ఘటనలో సంచలన విషయాలు..

## ముందే ప్రభుత్వానికి లేఖ రాసిన డీసీపీ..!



**న్యూఢిల్లీ,:** బెంగళూరు తొక్కిసలాట ఘటనలో 11 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. తాజాగా ఈ అంశంపై సంచలన విషయాలు బయటకు వచ్చాయి. తాజాగా విధానసౌధ భద్రతా విభాగం డీసీపీ ఎం.ఎన్. కరిబసవనగౌడ రాసిన లేఖ బయటపడింది. అందులో కర్ణాటక సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని ముందే హెచ్చరించినట్లు తేలిసంది. జూన్ 4న, డీసీపీ కర్ణాటక ప్రభుత్వానికి లేఖ రాశారు. "ఆర్సీబీకి దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున అభిమానులు ఉన్నారు. లక్షలాది మంది వేడుకకు రావొచ్చు. భద్రతా సిబ్బంది కొరత ఉంది. అభిమానుల భారీగా తరలి వస్తే అనుకోని ఘటనలు జరగవచ్చు. ప్రజా ప్రవేశ పాస్‌లను రద్దు చేయాలి. విధానసౌధ ప్రాంగణంలో సీసీటీవీ నిఘా అసంపూర్ణంగా ఉంది. దీనివల్ల భద్రతా సమస్యలు తలెత్తవచ్చు." అని ముందుగానే పరిపాలనా సంస్కరణల శాఖ కార్యదర్శి జి. సత్యవతికి రాసిన లేఖలో హెచ్చరంచారు. పీడబ్ల్యుడీ రెండు గంటల ముందుగానే వేదికను తనిఖీ చేసి, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తప్పనిసరి అని డీసీపీ పేర్కొన్నారు. విద్యుత్ పరికరాలకు ప్రత్యేక ఫిట్‌నెస్ సర్టిఫికేట్ గురించి కూడా ప్రస్తావించారు. ట్రాఫిక్, శాంతిభద్రతల మధ్య సమన్వయం లోపాన్ని డీసీపీ లేఖలో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఇతర జిల్లాల నుంచి అదనపు పోలీసు బలగాలను పిలిపించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. డీసీపీ లేఖ రాసినప్పటికీ.. ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు. ఎటువంటి నిర్దిష్ట చర్యలు తీసుకోలేదు. ఫలితంగా, బెంగళూరు ప్రమాదంలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు.

## మాగంటి మృతి దిగ్భ్రాంతికి గురి చేసింది: నారా లోకేష్



**అమరావతి,:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి పట్ల ఏపీ మంత్రి నారా లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. మాగంటి అకాల మరణం బాధాకరమన్నారు. తెలుగుదేశం పార్టీతోనే మాగంటి గోపీనాథ్ గారి రాజకీయ ప్రస్థానం మొదలైందని గుర్తు చేశారు. మాగంటి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. మాగంటి కుటుంబ సభ్యులకు నారా లోకేష్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాగంటి గోపీనాథ్ ఈరోజు కన్నుమూశారు. ఈనెల 5న ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 5.45 గంటలకు తుదిశ్వాస విడిచారు. 'హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గారి మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది. గుండెపోటుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన అకాల మరణం పొందడం బాధాకరం. తెలుగుదేశం పార్టీతోనే మాగంటి గోపీనాథ్ గారి రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1982లో తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయన 1985లో హైదరాబాద్ నగర తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్యేగా వరుసగా మూడు సార్లు విజయం సాధించి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం కృషి చేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మాగంటి గోపీనాథ్ గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని నారా లోకేష్ ట్వీట్ చేశారు.

## చాట్ జీపీటీ వాడకంలో.. భారత్ నంబర్ 1

### రెండో స్థానంలో అమెరికా
### 13.5% యూజర్లతో ప్రపంచంలో టాప్
### 10.8 కోట్లకు చేరిన వినియోగదారులు
### డీప్‌సీక్ వినియోగంలోనూ టాప్-3లో
### భారతీయుల జీవితంలో ఏఐ మమేకం




వాడకం అంటే మనవాళ్లదే. రెండేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన 'చాట్‌జీపీటీ' భారతీయులకు అత్యంత ఇష్టమైన యాప్‌గా అవతరించింది. చాట్‌జీపీటీ వినియోగంలో ప్రపంచంలో 13.5% మంది యూజర్లతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. అమెరికాను కూడా వెనక్కి నెట్టి ఔరా అనిపించింది. చాట్‌జీపీటీ వినియోగదారుల సంఖ్య భారత్‌లో 10.8 కోట్లకు చేరుకుంది. దీన్ని బట్టి భారతీయుల జీవితాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎలా మమేకం అయిపోయిందో అర్థం చేసుకోవచ్చు. టెక్నాలజీ వాడకంలో మనవాళ్లను కొట్టేవారే లేరని మరోసారి నిరూపితమైంది. చాట్‌జీపీటీ యూజర్లలో భారతీయులు నంబర్‌వన్‌గా నిలిచారు. అమెరికా కూడా మన తరవాతే ఉంది. యూఎస్ వాటా 8.9% మాత్రమే. ఇండోనేసియా 5.7, బ్రెజిల్ 5.4, ఈజిప్ట్ 3.9, మెక్సికో 3.5, పాకిస్తాన్ 3, జర్మనీ 3, ఫ్రాన్స్ 2.9, వియత్నాం 2.6% వాటాతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఏఐ ఆధారిత ఈ చాట్‌బాట్ సాంకేతిక నిపుణులకు మాత్రమే పరిమితం కాలేదు. విద్యార్థులు, కంటెంట్ క్రియేటర్స్‌కు తోడు సామాన్యులూ మన దేశంలో తెగ వాడేస్తున్నారు. హోంవర్క్‌లో సహాయం, మనసుకి నచ్చిన వారికి సందేశం, కావాల్సిన సమాచారాన్ని సేకరించడం, కంటెంట్ క్రియేషన్ .. అవసరం ఏదైనా అమెరికన్ కంపెనీ రూపొందించిన ఈ చాట్‌బాట్ వేగంగా భారత్‌లో విస్తరిస్తోందని క్వీన్ ఆఫ్ ది ఇంటర్నెట్‌గా ప్రసిద్ధి చెందిన విశ్లేషకురాలు, వెంచర్ క్యాపిటలిస్ట్ మేరీ మీకర్ తన '2025 ఏఐ ట్రెండ్స్' నివేదికలో తెలిపారు. అంతేగాక చైనా తయారీ ఏఐ చాట్‌బాట్ 'డీప్‌సీక్' వినియోగంలోనూ భారతీయులు మూడో స్థానంలో నిలిచారు. ప్రపంచ వినియోగదారుల్లో 6.9 శాతం మంది మనదేశం నుంచే ఉన్నారు. 33.9% వాటాతో చైనా, 9.2%తో రష్యా టాప్-2లో ఉన్నాయి. డీప్‌సీక్ మొత్తం వినియోగదార్ల సంఖ్య 5.4 కోట్లు.

### తెలుగులోనూ వినియోగం..

ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య భారీగా పెరగడం, బలమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిశ్రమ, డిజిటల్ పరివర్తనకు ప్రభుత్వ మద్దతు, ప్రాంతీయ భాషలపై దృష్టి పెట్టడం వంటి వివిధ అంశాలు ఏఐ వినియోగంలో ఈ పెరుగుదలకు కారణమని నివేదిక వెల్లడించింది. చాట్‌జీపీటీ తెలుగు, హిందీ, మలయాళం, తమిళం వంటి అనేక భారతీయ భాషలను సపోర్ట్ చేస్తుంది. అంటే మనకు కావాల్సిన సమాచారాన్ని తెలుగులోనూ అందిస్తుందన్నమాట. స్మార్ట్‌ఫోన్లు అందుబాటు ధరల్లో లభించడం, ఇంటర్నెట్ వేగం దూసుకెళ్లడం కూడా చాట్‌జీపీటీ వాడకం అధికం కావడానికి ముఖ్యమైన కారణంగా చెప్పవచ్చు.

### రోజుకు 100 కోట్లకుపైగా..

చాట్‌జీపీటీ వేదికగా రోజుకు 100 కోట్లకుపైగా సర్చెస్ నమోదవుతున్నాయంటే నోరెళ్లబెట్టాల్సిందే. వార్షిక సర్చెస్ 36,500 కోట్లకు చేరుకోవడానికి గూగుల్‌కు 11 ఏళ్ల సమయం పడితే.. చాట్‌జీపీటీ ఈ మైలురాయిని 5.5 రెట్లు వేగంగా రెండేళ్లలోనే అందుకుంది. 2022 నవంబర్ 30న రంగ ప్రవేశం చేసిన చాట్‌జీపీటీ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది వినోదం, ఆటల కోసం కాకుండా నేర్చుకోవడానికి, రాయడానికి, కోడింగ్ కోసం, కంటెంట్ క్రియేట్ చేయడానికి దీనిని ఉపయోగిస్తున్నందున ప్రజాదరణ విపరీతంగా పెరిగింది. చాట్‌జీపీటీకి అంతర్జాతీయంగా 80 కోట్ల మంది నెలవారీ యాక్టివ్ యూజర్లున్నారు. 21 నెలల క్రితంతో పోలిస్తే చాట్‌జీపీటీ యాప్‌లో మూడు రెట్లు ఎక్కువ సమయాన్ని యూజర్లు వెచ్చిస్తున్నారు.

### చెల్లించేందుకూ సిద్ధం..

ఇంకా ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. చాట్‌జీపీటీ పెయిడ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య గణనీయంగా పెరిగి 2 కోట్లు దాటింది. ఈ సంఖ్య సంవత్సరానికి 153 శాతం చొప్పున దూసుకెళుతోంది. ఈ ప్లాట్‌ఫామ్ మాతృ సంస్థ అయిన ఓపెన్ ఏఐకి పెద్ద మొత్తంలో ఆదాయ వనరుగా అవతరించింది. ఏడాదిలోనే ఈ మొత్తం పది రెట్లు పెరిగింది. చాట్‌బాట్ ఒక్కటే కంపెనీకి ఏటా రూ.31,709 కోట్ల ఆదాయాన్ని అందిస్తోంది. ఎక్కువ మంది యూజర్లు మెరుగైన ఫీచర్ల కోసం చెల్లించేందుకు వెనుకాడడం లేదు.

### డెస్క్‌టైమ్ అధ్యయనం ప్రకారం..

ఏఐ జోరులో భారత్ అగ్రగామిగా కొనసాగుతుందనడంలో సందేహం లేదు. ఈ ధోరణి కారణంగా దేశం నుంచి మరిన్ని ఏఐ స్టార్టప్‌లు ఉద్భవించడానికి దారితీసే అవకాశం ఉంది. డెస్క్‌టైమ్ అధ్యయనం ప్రకారం 92.2% భారతీయ కార్యాలయాలు తమ రోజువారీ కార్యకలాపాలలో చాట్‌జీపీటీ వినియోగాన్ని అనుమతించాయి. చాట్‌జీపీటీని స్వీకరించడంలో అమెరికా కంటే భారత్ చాలా ముందుంది. యూఎస్ కార్యాలయాలలో 72.2% మాత్రమే చాట్‌జీపీటీని ఉపయోగిస్తున్నాయి.

## ఈ నగరాలు...సముద్రం పాలు!

### తీరప్రాంతాలను శరవేగంగా కబళిస్తున్న కడలి
### ప్రపంచమంతటా పెరుగుతున్న సముద్రమట్టాలు
### సమస్యకు చెక్ పెట్టేందుకు దేశాల ప్రయత్నాలు



నదీజలాలు. నాగరికతకు పుట్టినిళ్లు. అత్యంత భారీ వర్షాలు వచ్చినప్పుడు ఉగ్రరూపంలో ఉప్పొంగినా తర్వాత సాధారణ స్థితికి వచ్చి మానవులకు ఎన్నో రకాలుగా ఉపయోగపడతాయి. కానీ సముద్రజలాలు అలాకాదు. ప్రపంచవ్యాప్తంగా సముద్రతీరమున్న ఎన్నో పట్టణాలను ఇప్పుడు సముద్రజలాల పెరిగే నీటిమట్టాలు అక్కడి ప్రజల్లో ఆందోళన మట్టాలను అమాంతం పెంచేస్తున్నాయి. తరతరాలుగా తీరప్రాంతాల్లోనే స్థిరనివాసం ఏర్పాటుచేసుకుని ఉంటున్న స్థానికులను సాగరజలాలు ఇప్పుడు బద్ధశత్రువుగా మారాయి. తీవ్రమైన వ్యాధి శరీరాన్ని కబళించినట్లు ఈ సముద్రజలాలు నెమ్మదిగా ఆయా తీరప్రాంతాల సమతల భూభాగాలను శాశ్వతంగా తనలో కలిపేసుకుంటున్నాయి. శరవేగంగా పెరుగుతున్న సముద్ర నీటిమట్టాలు ఇప్పుడు కోట్లాది మంది ప్రజలకు కంటిమీద కనుకులేకుండా చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా డజనుకుపైగా తీరప్రాంతాల్లో సముద్ర నీటిమట్టాలు ఇటీవలికాలంలో చాలా అత్యధిక వేగంతో పెరుగుతున్నాయని సింగపూర్‌లోని నాంయాంగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ(ఎన్‌టీయూ) శాస్త్రవేత్తలు కుండబద్దలు కొట్టారు. 2014 నుంచి చూస్తే గత ఆరేళ్లలోనే ఏటా ఒక సెంటీమీటర్ ఎత్తు సముద్రజలాల నీటిమట్టం పెరుగుతూ తీరప్రాంతాలను శాశ్వతంగా ముంచేసినట్లు తాజా అధ్యయనంలో తేలింది. ఆసియా, ఆఫ్రికా, యూరప్, ఉత్తర అమెరికా, ద.అమెరికా ఖండాల్లో 48 తీరనగరాలకు తీరనిశోకంగా సాగరజలాలు మారాయని అధ్యయనం పేర్కొంది. వాతావరణ మార్పులకుతోడు కుంగిపోతున్న భూమి కారణంగా ఈ సమస్య తీవ్రమవుతోందని తేలింది. రెండేళ్ల క్రితం ఈశాన్యచైనాలోని తియాంజిన్ నగరంలో తీరప్రాంత వీధులన్నీ కుంగడంతో వేలాది మందిని అపార్ట్‌మెంట్ల నుంచి హుటాహుటిన ఖాళీ చేయించారు. 2014 నుంచి 2020 ఏడాది వరకు చూస్తే తియాంజిన్ నగర భూభాగం ఏటా 18.7 సెంటీమీటర్లమేర కుంగింది. సముద్రజలాలు పెరిగి భూగర్భజలాలు పెరగడంతో నేల కుంగింది.

### ముంపు బారిన ముంబై

దేశ వాణిజ్య రాజధాని ముంబై మహానగరాన్నీ ముంపు సమస్య పట్టిపీడిస్తోంది. 2014 నుంచి చూస్తే సంవత్సరానికి 0.01 సెం.మీ.ల నుంచి 5.9 సెంటీమీటర్ల స్థాయిలో ముంబైలోని చాలా ప్రాంతాలను సముద్రనీరు ముంచేసింది. ఏటా 1 సెం.మీ.చొప్పున నేల సముద్రజలాల్లో కలిసిపోతున్న చోట్ల 62 లక్షల మంది జీవిస్తున్నట్లు ఎన్‌టీయూ అధ్యయనకారులు ప్రకటించారు. మాతుంగా ఈస్ట్‌లోని కింగ్ సర్కిల్ స్టేషన్ ప్రాంతం వేగంగా ముంపునకు గురవుతోంది. ఇక్కడ ఏటా 2.8 సె.మీ.ల మేర సముద్రజలాలు పెరుగుతున్నాయి. విశ్వవ్యాప్తంగా సాగరజలాలు గత ఏడాది 0.59 సెంటీమీటర్లమేర ఎగిశాయని నాసా అధ్యయనంలో స్పష్టమైంది. భూగర్భజలాలను విచ్చలవిడిగా తోడేయడం, ఊహించనంత బరువుతో ఆకాశహర్మ్యాలను నిర్మించడం, నిరాటంకంగా కొనసాగుతున్న మెట్రో ప్రాజెక్ట్ పనులు, చిత్తడినేలలను ప్రభుత్వాలు పునరుద్ధరించడం తదితర కారణాలు సైతం మహానగరంలోకి సాగరజలాలు చొచ్చుకొచ్చేలా చేస్తున్నాయి. కనీసం 50 లక్షల జనాభా ఉన్న సముద్రతీర నగరాల వెంట సముద్రనీటిమట్టాలు పెరుగుతున్న అంశాన్ని ఉపగ్రహాల సాయంతో విశ్లేషించి ఈ అధ్యయనం చేశారు.

### అగ్రరాజ్యంలోనూ..

అమెరికాలోనిమయామీసిటీనిసాగరజలాలు ముంచెత్తుతున్నాయి. 2014 నుంచి 2020 వరకు చూస్తే మయామీ సిటీలో కోకోనట్ గ్రోవ్‌సహా చాలా ప్రాంతాలు గరిష్టంగా 2.2 సెంటీమీటర్లమేర సముద్రజలాల మట్టాలు పెరిగాయి. ఏటా 1 సెం.మీ. సముద్రనీరు పెరుగుతున్న ప్రాంతాలు 43,000 మందికిపైగా అమెరికన్లు నివసిస్తున్నారు.

## ఎట్టకేలకు జనగణన



దేశంలో జనగణన నిర్వహించబోతున్నట్టు ఆరేళ్ల సుదీర్ఘ జాప్యం అనంతరం బుధవారం అధికారిక ప్రకటన వెలువడింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల 16న విడుదల చేస్తామని, 2027 మార్చి 1తో ఈ మొత్తం ప్రక్రియ పూర్తవుతుందని అందులో తెలియజేశారు. అంటే ఆ ఏడాది ఫిబ్రవరి 28తో జనగణనను ముగిస్తారన్నమాట. మంచు కురిసే లద్దాఖ్, జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో వచ్చే ఏడాది అక్టోబర్ 1కల్లా జనగణన ప్రక్రియ ముగుస్తుంది. అంటే సెప్టెంబర్ నెలాఖరుకు జనగణన పూర్తవుతుంది. ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదల కాబోతోంది. ఆ తర్వాతగానీ మెథడాలజీ తదితర వివరాలపై స్పష్టత రాదు. ప్రక్రియ ముగించదల్చుకున్న తేదీని గమనిస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి తుది గణాంకాలు వెల్లడికావొచ్చని తెలుస్తోంది. కనుక ప్రస్తుత లోక్‌సభ గడువు ముగిసేలోగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ఉండకపోవచ్చు. స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారి జనగణనతోపాటు కులగణన కూడా వుండబోతోంది. రాజకీ యంగా, సామాజికంగా సంచలనం కలిగించగల కులగణన స్వరూప స్వభావాలేమిటో తెలియా లన్నా నోటిఫికేషన్ వచ్చేవరకూ ఆగాల్సిందే. జనగణన రెండు దశల్లో వుంటుంది. మంచుకురిసే ప్రాంతాలు మినహా దేశంలో మిగిలినచోట్ల వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్ నెలల్లో తొలి దశఉంటుంది. అందులో నివాస గృహాలు, వాటి యాజమాన్య వివరాలు, నివాసం వుండేవారి సంఖ్య, వారికి ఎలాంటి సౌకర్యాలున్నాయో, ఏయే వాహనాలున్నాయో లెక్కేస్తారు. రెండో దశలో ఇంటి యజమాని పేరు, ఆయన భార్యాపిల్లలు, విద్యార్హతలు, ఉద్యోగ వ్యాపార వివరాలు, ఆదాయ వనరులు, కులమతాలు వగైరాలు తెలుసుకుంటారు. ప్రభుత్వాలకు డేటా ప్రాణప్రదమైనది. ఏ విధానం రూపొందించాలన్నా, ఏ పథకం ప్రవేశ పెట్టాలన్నా, ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా వాటి లబ్ధిదారులెందరు, ప్రభుత్వ నిర్ణయాల ప్రభావం ఎందరిపై పడుతుంది వగైరా అంశాలన్నీ అవసరమవుతాయి. దేశంలో పట్టణీకరణ విస్తృతి, స్త్రీ పురుష నిష్పత్తి, కుటుంబాల ఆర్థిక స్థితిగతులు, వలసలు, నివాసగృహాల తీరుతెన్నులు వగైరాలన్నీ జనగణనలోనే వెల్లడవుతాయి. మహిళలకు అవసరమైన పథకాలకూ, దారిద్ర్య నిర్మూలన పథకాల రూపకల్పనకూ, గృహనిర్మాణం, ఉపాధి హామీ పథకం వంటివి ఎక్కడెక్కడ అవసరమో తేల్చడానికి జనగణనే ఆధారం. ఒక్కమాటలో చెప్పాలంటే దేశ సంపూర్ణ ముఖచిత్రం ఈ జనగణన ద్వారా ఆవిష్కృతమవుతుంది. ఆఖరుగా 2011లో జనగణన జరిగింది గనుక 2021లో వాస్తవంగా తదుపరి జనగణన వుండాలి. అది మొదలుకాబోతోందని 2019 డిసెంబర్‌లో కేంద్రం ప్రకటించింది కూడా. ఆ ప్రక్రియ తొలి దశ 2020లో మొదలయ్యేలోగానే కరోనా మహ మ్మారి విరుచుకుపడటంతో జనగణన కాస్తా మూలనబడింది. ఆ తర్వాతైనా దాన్ని ప్రారంభించా లన్న ఆసక్తి కేంద్రంలో ఎందుకనో కనబడలేదు. కారణాలేమిటో కూడా చెప్పలేదు. కరోనా ప్రభావం తగ్గాక ప్రపంచంలో అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి 143 దేశాలు యుద్ధప్రాతిపదికన జనగణన పూర్తిచేశాయి. మనతోసహా 44 దేశాలు మాత్రమే దానికి దూరంగా వున్నాయి. కేంద్ర హోంశాఖ ప్రతినిధి చెప్పినట్టు అప్పుడు జనగణన పూర్తయిన దేశాల్లో లభ్యమైన డేటా నాణ్యమైనది, సమగ్రమైనదీ కాదని తేలివుండొచ్చు. కానీ విధాన నిర్ణయాల రూప కల్పనలో అక్కడి ప్రభుత్వాలకు ఎంతో కొంత పనికొచ్చింది. అసలు లేనిదానికన్నా ఇది మేలే. మన వరకూ చూస్తే జనగణన ఆలస్యం వల్ల విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్థితిగతులు వంటి 15 అతి కీలకమైన సర్వేలు నిలిచిపోయాయి. ఫలితంగా పథకాల అమలు చీకట్లో తడుములాటగా మిగిలింది. దేశంలో చాలామంది, ముఖ్యంగా రాజకీయంగా చురుగ్గా ఉండదల్చుకున్నవారు ఎదురు చూసేది నియోజకవర్గాల పునర్విభజన గురించే. 1971 జనాభా లెక్కల ఆధారంగా 1973లో లోక్ సభ స్థానాల సంఖ్యను 543గా నిర్ధారించారు. ఆ తర్వాత పునర్విభజన జోలికెళ్తే సమస్య లెదురవు తాయన్న భయంతో రెండు రాజ్యాంగ సవరణల ద్వారా దాన్నే కొనసాగిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రా ల్లోనూ, తూర్పునున్న హిందీయేతర రాష్ట్రాల్లోనూ, దక్షిణాది రాష్ట్రాల్లోనూ కేంద్ర ప్రభుత్వ కుటుంబ నియంత్రణ సమర్థంగా అమలుకావటంతో జనాభా రేటు నియంత్రణలో వుంది. కానీ హిందీ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఆ విషయంలో చొరవచూపలేదు. దాంతో అక్కడ జనాభా పెరిగింది. జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన ప్రక్రియవుంటుంది కనుక తమ ప్రాంతాల్లో లోక్‌సభ స్థానాలు గణనీయంగా తగ్గుతాయని హిందీయేతర రాష్ట్రాలు వాదిస్తున్నాయి. 2011నాటి జనగణన తుది ఫలితాలు 2013లో వెల్లడయ్యాయి. ఇప్పుడు కూడా అదే సమయంపడితే 2029లోగానీ పూర్తి ఫలితాలు రావు. ఆ తర్వాతే పునర్విభజన ప్రక్రియ ఉంటుందని భావించాలి. జాప్యం మాటెలావున్నా జనగణన ప్రారంభం కాబోతోందన్న ప్రకటన హర్షించదగ్గది. సాధా రణ ప్రజానీకానికి జనగణనపై పెద్దగా ఆసక్తివుండదు. కానీ విధాన నిర్ణేతలూ, విశ్లేషకులూ దీన్ని ప్రాణప్రదంగా భావిస్తారు. ఎందుకంటే అన్ని రకాల సర్వేలకూ ఇదే ప్రాతిపదిక. నేతలూ, పార్టీలూ సరేసరి. ఎవరినుద్దేశించి ఎలాంటి పథకాలు రూపొందించాలో, ఏ సమస్యల్ని ప్రధానంగా ప్రస్తావించాలో నిర్ణయించుకోవటానికి జనగణన తోడ్పడుతుంది. ఈ ప్రక్రియకు అధునాతన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవటం, పారదర్శకతకు చోటీయటం అవసరం. ఇక 1931 తర్వాత తొలిసారి కులగణన జరుగుతున్నందువల్ల వివాదాలు తలెత్తకుండా జాగరూకతతో వ్యవహరించాలి.